కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ మంగళవారం 28 జనవరి 2025
సంపుటి: 14, సంచిక: 299 పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## వక్ఫ్ సవరణ బిల్లుకు జేపీసీ ఆమోదం

14 సవరణలను ఆమోదించిన కమిటీ




2

## కుంభమేళాలో స్నానం చేస్తే విముక్తి రాదు

ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు



2

## కుంభమేళాలో స్నానం చేసిన కేంద్ర మంత్రి



ప్రయాగ్‌రాజ్ జనవరి 27 (నిఘా న్యూస్): ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక మేళాగా ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న 'మహాకుంభ్'లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సోమవారం పాల్గొన్నారు. గంగా, యమునా, సరస్వతీ నదులు సంగమించే త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించారు. దీనికి ముందు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్న ..మిగతా 2లో

## ఉత్తరాఖండ్‌లో అమల్లోకి ఉమ్మడి పౌరస్మృతి



స్వాతంత్ర్యం తరువాత యూసీసీని అమలు చేసిన తొలి రాష్ట్రం

- గతేడాది ఫిబ్రవరిలో బిల్లుకు ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఆమోదం
- అమలు కోసం ప్రత్యేక పోర్టల్, మొబల్ యాప్ ఏర్పాటు
- పోర్చుగీస్ పాలనలో నుండి గోవాలో ఉమ్మడి పౌరస్మృతి అమల్లో ఉంది

2

## ప్రజలను మాయ చేస్తున్న రేవంత్

కేంద్ర పథకాల పేర్లు మార్చితే ఊరుకోం

కాంగ్రెస్ పథకాలకు ఏమైనా పేర్లు పెట్టుకోండి

కేంద్రం ఇచ్చే పథకాలకు ప్రధాని ఫొటో ఎందుకు పెట్టరు: బండి

హైదరాబాద్ జనవరి 27(నిఘా న్యూస్): మీ పథకాలకు ఏమైనా పేర్లు పెట్టుకోండి కానీ కేంద్ర పథకాలకు పేర్లు మార్చితే ఊరుకోమని కేంద్ర మంత్రి బండిసంజయ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తుందన్నారు. పరిస్థితి అంత వరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ తాము అన్యాయం చేయబోమని స్పష్టం చేశారు. ప్రజలందరికీ ఉచితంగా బియ్యం కేంద్రమే ఇస్తోంది కదా, గరీబ్ కళ్యాణ్ యోజన అని పేరు పెడితే తప్పేంది. ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చయ్యే సంక్షేమ పథకాలకు ఎవరి పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని.. కాంగ్రెస్‌కు నచ్చితే ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం పేర్లు పెట్టుకున్నా అభ్యంతరం లేదంటూ ..మిగతా 2లో


# ఈటల రాజేందర్... నక్సలైట్ కాదు

## మావోయిస్టు భావజాలం వేరు, నక్సలైట్‌గా పని చేయడం వేరు

- నక్సలిజంతో ఎంపీ ఈటలకు ఎలాంటి సంబంధం లేదు
- హంతకులకు అవార్డులు ఇవ్వమని సిఫారసు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- నక్సలైట్లతో కలిసి వందలాది మందిని హత్య చేయించిన గద్దర్
- హత్యలు చేయించిన గద్దర్‌కు పద్మ అవార్డు ఇవ్వలేము
- నంది అవార్డుల స్థానంలో, గద్దర్ అవార్డులను మా వాళ్ళు తీసు కోరు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి వ్యాఖ్యలు

కరీంనగర్ జనవరి 27(నిఘా న్యూస్): : ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామంటూ ఆయనను అవమానించేలా ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'పద్మ' అవార్డుల కోసం జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని, గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డు ఇస్తామని ఆయన ప్రశ్నించారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు పద్మ అవార్డ్ ఇవ్వకపోవడంపై తెలంగాణ ప్రభుత్వం చేస్తోన్న విమర్శలకు కేంద్రమంత్రి, బీజేపీ కీలక నేత బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ఎంతో మంది బీజేపీ కార్యకర్తలను, ఎన్ కౌంటర్లలో పోలీసులను పొట్టన బెట్టుకున్న వ్యక్తి గద్దర్ అని అలాంటి వ్యక్తికి పద్మ అవార్డు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మావోయిస్టుగా పని చేసి ఎంతో మంది ప్రాణాలు తీసిన వారిలో గద్దర్ ఒకరని, ఆయనకు పద్మ అవార్డు ఇచ్చేదే లేదని కుండబద్దలు కొట్టారు.సోమవారం కరీంనగర్లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ నక్సలైట్ కాదన్నారు. మావోయిస్టు భావజాలం వేరు, నక్సలైట్‌గా పని చేయడం వేరని పేర్కొన్నారు. నక్సలిజంతో ఎంపీ ఈటల రాజేందర్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. అలాగే. నంది అవార్డుల స్థానంలో రాష్ట్ర ..మిగతా 2లో






## ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాలు

6,15,677 మంది అర్హులకు లబ్ది

రైతు భరోసా, ఆత్మీయ భరోసాకు రూ. 579 కోట్లు విడుదల

హైదరాబాద్ జనవరి 27(నిఘా న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మరో రికార్డు నెలకొల్పింది. ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాలను విజయవంతంగా ప్రారంభించటంతో పాటు.. అక్కడికక్కడే 6,15,677 మంది అర్హులకు లబ్ది కల్పించింది. అదే రోజున రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఆర్థికశాఖ రూ. 579 కోట్లు విడుదల చేసింది. లక్షలాది మంది రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాల్లో ఈ నిధులు జమ కావటంతో రాష్ట్రమంతటా ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగానే ప్రజా పాలనలో ..మిగతా 2లో

## జగన్ కేసులో రఘురామ పిటిషన్ ఉపసంహరణ

రోజువారి విచారణ చేపట్టాలని ఆదేశం

బెయిల్ రద్దు పటిషన్ తిరస్కరించిన ధర్మాసనం

కేసును బదిలీ చేయాల్సిన అవసర లేదని వ్యాఖ్యలు

2



## టీడీపీలోకి విజయసాయి రెడ్డికి నో ఎంట్రీ

ఉప ముఖ్యమంత్రి పదవిని కోరుకోవడం లేదు

రెడ్ బుక్ ప్రకారం కేసులు పెడితే పోలీసులు సరిపోరు

జాతీయ ప్రధాన కార్యదర్శిగా తప్పుకుంటాను

పార్టీలో కొత్తవారికి ఎక్కువ అవకాశాలు ఇస్తాం : నారా లోకేష్

విశాఖపట్టణం జనవరి 27(నిఘా న్యూస్): ఇకపై పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి పదవి తీసుకోనని, పార్టీకోసం పనిచేస్తానని మంత్రి లోకేశ్ అన్నారు. తనతో పాటు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా పదవి తీసుకోరని అన్నారు. పార్టీలో కొత్తవారికి అవకాశం కల్పించాలన్నదే తమ ..మిగతా 2లో

## సంక్షేమ పథకాలకు నిధుల కొరత

గతంలో చేసిన అప్పులకు వడ్డీ కట్టడం కష్టంగా ఉంది

- అప్పులు చేసి దుబారా చేసిన జగన్
- ఆర్థిక పరిస్థితి బాగోలేక పోతే పన్నుల భారం తప్పదు
- నీతి ఆయోగ్ నివేదికపై మీడియా సమావేశంలో చంద్రబాబు

అమరావతి జనవరి 27(నిఘా న్యూస్): గత ప్రభుత్వం చేసిన అప్పులపై వడ్డీలు కట్టలేని దుస్థితిలో ప్రస్తుతం రాష్ట్రం ఉందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోతే ప్రజలపై పన్నుల భారం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.అభివృద్ధి పనుల వల్లే సంపద పెరుగుతుంది. అలాగని అప్పులు చేసి.. పనులు చేస్తే ఇబ్బందులు పెరుగుతాయి. అప్పులు తిరిగి తీర్చే శక్తి మనకు ఉందో లేదో చూడాలి. అప్పులు చేసి తిరిగి చెల్లించే శక్తి మన రాష్ట్రానికి లేదు. అందుకే గత ప్రభుత్వం.. ప్రభుత్వ కార్యాలయాలను తాకట్టు పెట్టింది. గత ఐదేళ్లలో వచ్చిన డబ్బును ఏం చేశారో తెలియడం లేదు. తెచ్చిన అప్పులను ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెడితే ఆదాయం పెరగదు. గతంలో చేసిన అప్పులకు వడ్డీ కట్టడం కూడా ప్రస్తుతం కష్టంగా ఉందని చంద్రబాబు అన్నారు. అభివృద్ధి పనులకు ..మిగతా 2లో



## రైతు భరోసాను జమ చేసిన ప్రభుత్వం



రాష్ట్ర వ్యాప్తంగా 4,41,911 మంది ఖాతాల్లోకి నగదు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

హైదరాబాద్ జనవరి 27(నిఘా న్యూస్): రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా జమ చేసే పక్రియ కొనసాగుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తొలి విడతలో మండలానికి ఒక గ్రామంలో రైతు భరోసా సొమ్ము విడుదల చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 4,41,911 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేసినట్లు చెప్పారు. 577 మండలాల్లోని 9,48,333 ఎకరాలకు గాను ..మిగతా 2లో



## హామీల అమలుకు... ఆర్టీసీ సమ్మె నోటీసు

ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, రెండు పీఆర్సీల అమలు, సీసీఎస్, పీఎఫ్ డబ్బులు రూ.2,700 కోట్లు చెల్లింపు తదితర డిమాండ్లపై సమ్మె సైరన్

హైదరాబాద్ జనవరి27 (నిఘా న్యూస్): తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నేతలు ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, రెండు పీఆర్సీల అమలు, సీసీఎస్, పీఎఫ్ డబ్బులు రూ.2,700 కోట్లు చెల్లింపు తదితర డిమాండ్లను ..మిగతా 2లో


## కిడ్నీ రాకెట్‌లో... డాక్టర్ల కోసం పోలీసుల గాలింపు

ఇప్పటి వరకు 9మందిని అరెస్టు చేసిన పోలీసులు

2

# సంక్షేమ పథకాలకు నిధుల కొరత

మొదటి పేజీ తరువాయి...



నిధులు కేటాయించలేని పరిస్థితి ఎదురవుతుం దన్నారు. 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నీతి ఆయోగ్ ఇచ్చిన రిపోర్టుపై సీఎం మీడియా సమావేశం నిర్వహించారు. స్టేట్ ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్-2025 నివేదికపైనా సీఎం ప్రజెంటేషన్ ఇచ్చారు. నీతి ఆయోగ్ ఇచ్చిన నివేదికను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. '202223 ఆర్థిక సంవత్సరంలో రూ.67 వేల కోట్లు అప్పులు తెచ్చారు. కానీ, ఆ రుణాలను కనీస స్థాయిలో కూడా అభివృద్ధి ప్రాజెక్టులకు వినియోగించలేదు. వచ్చిన డబ్బులతో వైకాపా ప్రభుత్వం దుబారా ఖర్చులు చేసింది. రాష్ట్ర ఆదాయం కూడా 17.1 శాతం నుంచి 9.8 శాతానికి తగ్గిపోయింది. అప్పులు 16.5 శాతం మేర పెరిగాయి. వడ్డీ కట్టే మొత్తం కూడా 15శాతం పెరిగింది. ఇవి కాకుండా ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ కూడా పెద్ద మొత్తంలో జరిగాయి. వైకాపా హయాంలో ఎక్కువ వడ్డీకి అప్పులు తేవడం, మూల ధన వ్యయం లేకపోవడం, పన్నులు పెంచడం లాంటి వివిధ అంశాల వల్ల ఏపీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని వివరించారు. 'ఆరోగ్యంపై మనం ఎప్పుడూ దృష్టి పెడతాం. ఆరోగ్యం బాగుంటేనే ఏద్కెనా చేయగలం. అనారోగ్యంతో ఉంటే ఇంట్లో అందరికీ ఇబ్బందులు వస్తాయి. ఆర్థిక పరిస్థితి బాగా లేకుంటే అభివృద్ధి పనులు సరిగా చేయలేం. ఇదే కొనసాగితే చివరికి బాధపడేది ప్రజలే. రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం అందరూ ఆలోచించాలి. అభివృద్ధి పనులపై నిధులు ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోతే ప్రజలపై పన్నుల భారం పడుతుందని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేని పరిస్థితి ఎదురవుతుందన్నారు. గతంలో చేసిన అప్పులకు వడ్డీ కట్టడం కూడా ప్రస్తుతం కష్టంగా ఉంది' అని చంద్రబాబు అన్నారు. 2022-23లో రూ.7,244 కోట్లు మూలధన వ్యయం చేశారు. ఒక్క జలవనరు ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. 2014-19తో పోలిస్తే గత ఐదేళ్లలో మూల ధన వ్యయం 60శాతం మేర తగ్గిపోయింది. ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్‌లో ఏపీ 18వ ర్యాంకులో ఉంది. వృద్ధి రేటు లేకపోవడం వల్ల రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల మేర నష్టపోయింది. ఏటా రూ.76 వేల కోట్ల ఆదాయం పోయింది. అందుకే రాష్ట్రానికి వృద్ధి రేటు అనేది చాలా ముఖ్యమని మా ప్రభుత్వం పదే పదే ప్రస్తావిస్తోంది. తలసరి ఆదాయంలో కూడా పొరుగు రాష్ట్రాలతో పోల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజల కొనుగోలు స్థితి కూడా తగ్గిందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక సామాజిక విధ్వంసంపై ఏడు శ్వేతపత్రాలు కూడా విడుదల చేశాం. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల్లో భాగంగా 15శాతం వృద్ధి రేటు కోసం ప్రణాళికలు వేస్తున్నాం. తద్వారా 2047 నాటికి తలసరి ఆదాయం రూ.58,14,916 కు చేరుతుంది. సూపర్ సిక్స్‌లో ఎన్టీఆర్ భరోసాలో భాగంగా 64 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నాం. దీపం 2.0 పథకంలో ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, ఇసుక, మద్యం, క్లీన్ ఎనర్జీ, ఎమ్ఎస్ఎమ్ఈ లాంటి కొత్త విధానాలు తీసుకువచ్చాం. రూ.8,258 కోట్ల మేర బిల్లులు క్లియర్ చేశాం. రూ.9015 కోట్ల మేర కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్ కూడా ఇచ్చి 76 పథకాలు రివైవ్ చేశాం అని అన్నారు. ఇప్పటి వరకు రూ.6,33,568 కోట్ల మేర పెట్టుబడులు వస్తున్నాయి. తద్వారా 4.10 లక్షల ఉద్యోగాలు వస్తాయి. మేం ఊహించిన దానికంటే ఎక్కువ విధ్వంసం జరిగింది. రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. మేము చెప్పిందే ఇప్పుడు నీతి ఆయోగ్ ధృవీకరించింది. వృద్ధిరేటు సాధిస్తే ఆదాయం పెరిగి, అప్పులు తగ్గించుకునే పరిస్థితి వస్తుంది. ఎక్కువ వడ్డీకి అప్పులు తీసుకొచ్చారు. అందుకే డెట్ రీ షెడ్యూల్‌కి వెళ్తున్నాం. ఆర్థిక రంగంలో సుస్థిరత వస్తేనే రాష్ట్రం గాడిన పడుతుంది. వైకాపా హయాంలో తలసరి ఆదాయం పెరగలేదు. కానీ, తలసరి అప్పు పెరిగింది. గాడిన పెట్టడానికి కొంచెం ఆలస్యం అవుతోంది. ప్రజలు అర్థం చేసుకోవాలి. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంతోపాటు మెరుగైన పాలన అందిస్తాం' అని చంద్రబాబు అన్నారు.

## కుంభమేళాలో స్నానం చేస్తే విముక్తి రాదు

న్యూఢిల్లీ జనవరి 27(నిఘా న్యూస్): కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా క్షమించరాని తప్పులు చేశారని.. అలాంటి వ్యక్తులు కుంభమేళాలో స్నానాలు చేస్తే విముక్తి రాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కచ్చితంగా మోడీ, అమిత్ షా నరకానికి వెళ్తారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు గెలుస్తామని మోడీ విర్రవీగాడు. తీరా చూస్తే పొత్తు లేకపోతే దిక్కులేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రస్తుతం మోడీ భవిష్యత్తు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బిహార్ ముఖ్యమంత్రి నితీష్ చేతుల్లో ఉందని అన్నారు. ఎన్డీఏ నుంచి ఆ ఇద్దరు తప్పుకుంటే మోడీ సర్కార్ పతనం ఖాయమని తెలిపారు. కాగా, ఈ ఉదయం కుటుంబసభ్యులతో కలిసి అమిత్ షా మహాకుంభమేళాలో పుణ్య స్నానం చేశారు. ఈ సందర్భంగా అమిత్ షాకు సాధువులు తిలకం దిద్దారు. ఆ తర్వాత ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమానికి అమిత్ షా అర్చన చేసి గంగా హారతి ఇచ్చారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో ఇది 15వ రోజు. ఇప్పటికే కుంభమేళాకు 13 కోట్లకుపైగా భక్తులు హాజరయ్యారు. ఫిబ్రవరి 5వ తేదీన మహాకుంభమేళాకు ప్రధాని మోడీ రాబోతున్నారు. దానికి ముందే ఇవాళ ప్రయాగ్‌రాజ్‌కు అమిత్ షా రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ఈ కుంభమేళాకు భారీగా భక్తులు తరలివస్తున్నారు. ప్రపంచ దేశాల నుంచి ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలు చేస్తున్నారు. రష్యా, ఉక్రెయిన్, అమెరికా, జపాన్, జర్మనీ, నెదర్లాండ్, కెనడా, స్విట్జర్లాండ్, స్వీడన్, సహా 73 దేశాల దౌత్యవేత్తలు సైతం ఫిబ్రవరి 1న కుంభమేళాలకు వస్తున్నారు.

## ప్రజలను మాయ చేస్తున్న రేవంత్

మొదటి పేజీ తరువాయి...

వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసిందని తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అని స్పష్టం చేశారు. రైతు భరోసా, కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, వీధి దీపాలు, రోడ్ల పైసలన్నీ కేంద్ర ప్రభుత్వానివే అని చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనేలేదన్నారు. 'మండలానికి ఒక గ్రామంలోనే నాలుగు పథకాలకు ఎంపిక చేసి లబ్ధి చేయడమేంది, మిగిలిన గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేయలేదా రాష్ట్ర ప్రజలకు ఇంత దుర్మార్గంగా చీటింగ్ చేస్తారా రాష్ట్ర ప్రజలందరికీ లబ్ధి చేకూరుస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామానికి లబ్ధి చేకూర్చడం నీచం. కాంగ్రెస్ నేతల జేబుల తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో ఎవరు బల్కెపోయారో ప్రజలందరికీ అర్థమైందని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

# ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాలు

మొదటి పేజీ తరువాయి...

నాలుగు సంక్షేమ పథకాలు విజయవంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజునే లక్షలాది మంది ఈ సంక్షేమ పథకాలను అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంపిక చేసిన 563 గ్రామాల్లో ఈ పథకాలను ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. విద్యార్థులకు నాసిరకం భోజనం తీరు మార్చుకోని సెంట్రల్ కిచెన్ సిబ్బంది ఆయా గ్రామాల్లో ఉన్న రైతులకు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఆర్థిక సాయాన్ని అప్పటికప్పుడే వారి ఖాతాల్లో జమ చేసింది. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేసింది. గూడు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించింది. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు కొత్త కార్డులు జారీ చేసింది. పాత కార్డుల్లో అదనంగా సభ్యులను నమోదు పక్రియను పూర్తి చేసింది. మొదటి రోజునే రాష్ట్ర ప్రభుత్వం రూ.569 కోట్ల రైతు భరోసా విడుదల చేసింది. మొత్తం 32 జిల్లాల్లో 563 గ్రామాలలో 4,41,911 మంది రైతులకు ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. ఒక్క రోజులోనే మొత్తం రూ.569 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసింది. మొదటి రోజునే 9,48,333 ఎకరాల విస్తీర్ణంలోని భూమికి రైతు భరోసాను చెల్లించింది. 26వ తేదీన బ్యాంకులకు సెలవు దినం కావటంతో.. 27వ తేదీ ఉదయం నుంచి ఈ రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. మొదటి విడతగా రూ.6 వేలు చెల్లించింది. తొలి రోజున దాదాపు 18,180 వేల వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఈ నగదు సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేసింది. ఈ పథకానికి తొలి రోజునే ఆర్థిక శాఖ రూ.10.91 కోట్లు విడుదల చేసింది. గత పదేండ్లుగా కొత్త రేషన్ కార్డులకు ఎదురుచూసిన తెలంగాణ ప్రజల నిరీక్షణ ఫలించింది. ప్రజా ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు జారీ ప్రారంభించింది. వీటితో పాటు పాత రేషన్ కార్డుల్లో అదనపు కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసింది. తొలి రోజున 531 గ్రామాల్లో 15414 కొత్త కార్డులు ఇచ్చింది. వీటిలో 51912 మంది కుటుంబ సభ్యులు లబ్ది పొందారు. వీటితో పాటు అదనపు సభ్యులను చేర్చాలంటూ 1.02 లక్షల మంది కార్డుదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఏళ్లకేళ్లుగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించింది. ఇప్పటికే ఉన్న కార్డుల్లో అదనంగా 1,03,674 మంది కుటుంబ సభ్యులను నమోదు చేసింది. వచ్చే నెల నుంచి వీరికి రేషన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయనుంది. గూడు లేని నిరుపేదల కు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో తొలి రోజునే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 72 వేల మంది పేదలకు ఇళ్ల పత్రాలను అందించింది.

## కుంభమేళాలో స్నానం చేసిన కేంద్ర మంత్రి

మొదటి పేజీ తరువాయి...

అమిత్‌షాకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రాష్ట్ర మంత్రులు సాదర స్వాగతం పలికారు. అనంతరం శృంగేరి, పూరి, ద్వాకరా శంకరాచార్యులను కలుసు కోవడంతో ఆయన పర్యటనతో ముగిసింది. సాయంత్రం ప్రయాగ్‌రాజ్ నుంచి బయలుదేరి తిరిగి ఢల్లీకి చేరుకున్నారు. మహాకుంభ కీలక రోజులు కావడంతో మహాకుంభ్ ఏరియాలో నో వెహికల్ జోన్ ప్రకటించారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ వెహికల్ పాస్‌లు చెల్లవని మహాకుంభ్ మీడియా సెంటర్ ప్రకటించింది. సమీపంలోని పార్కింగ్ ప్రాంతాల్లో మాత్రమే వాహన యజమానులు పార్కింగ్ చేసుకోవాలని సూచించింది. మహాకుంభ్ భద్రతా ఏర్పాట్ల కోసం 10 వేలకు పైగా స్థానిక పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించారు. జనవరి 29న మౌని అమావాస్య (రెండవ సాహి స్నాన్), ఫిబ్రవరి 3 వసంత పంచమి (మూడవ సాహి స్నాన్), ఫిబ్రవరి 12న మాఘ పౌర్ణమి, ఫిబ్రవరి 26న మహా శివరాత్రి భక్తులు విశేషంగా హాజరుకానున్నారు. 45 రోజుల పాటు జరిగే మహాకుంభ్ మేళాకు 45 కోట్ల మంది భక్తులు హాజరవుతారని యూపీ ప్రభుత్వం అంచనా వేసింది.

## హామీల అమలుకు... ఆర్టీసీ సమ్మె నోటీసు

మొదటి పేజీ తరువాయి...

యాజమాన్యం ముందు ఉంచారు. డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెకు దిగుతామని నోటీసుల్లో పేర్కొన్నారు. మేనిఫెస్టోలోని అంశాలను ప్రభుత్వం అమలు చేయాలి. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణను ప్రైవేటు కంపెనీలు చేస్తున్నాయి. వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహించడం లేదు. యూనియన్లు రద్దు చేసి, కార్మికులకు పనిగంటలు పెంచారని జేఏసీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాల నేతలు బస్ భవన్ వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నప్పటికీ ఆర్టీసీ కార్మికుల సమస్యలపై స్పందించడం లేదన్నారు. ఆర్టీసీ కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని సంఘాల నేతలు మండిపడ్డారు. ఇలానే నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వానికి తమ తడాఖా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఐదేండ్ల తర్వాత సమ్మె చేయడం ఇదే తొలిసారి అని గుర్తు చేశారు.

## వక్ఫ్ సవరణ బిల్లుకు జేపీసీ ఆమోదం

న్యూఢిల్లీ జనవరి 27(నిఘా న్యూస్): వక్ఫ్ బోర్డ్ అధికారాలకు కోత పెడుతూ మోదీ సర్కార్ తీసుకొచ్చిన 'వక్ఫ్ సవరణ బిల్లు'కు జెపిసి ఆమోదం లభించింది. ఈ బిల్లు పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ సమావేశమైన పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సభ్యులు ప్రతిపాదించిన మొత్తం 14 సవరణలను జేపీసీ ఆమోదించింది. విపక్షాలు సూచించిన మార్పులు తిరస్కరణకు గురయ్యాయి. వక్ఫ్ సవరణ బిల్లు పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా 14 సవరణలను కమిటీ ఆమోదించినట్లు ప్యానెల్ ఛైర్మన్ జగదాంబిక పాల్ వెల్లడించారు. ఈ సవరణలు చట్టాన్ని మరింత శక్తివంతంగా మారుస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కమిటీలో ఎన్డీయే సభ్యులు సూచించిన మార్పులకు ఆమోదం లభించగా విపక్షాలు సూచించిన మార్పులు తిరస్కరణకు గురయ్యాయి. వీటిపై ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో కమిటీ పనిచేయలేదని విపక్ష సభ్యులు ఆరోపించారు. మొత్తంగా జేపీసీ సూచించిన 14 ప్రతిపాదనల ఆమోదానికి సంబంధించి జనవరి 29న ఓటింగ్ జరగనుంది. జనవరి 31న తుది నివేదిక లోక్‌సభకు అందజేయనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం.

## ఉత్తరాఖండ్‌లో అమల్లోకి ఉమ్మడి పౌరస్మృతి

న్యూఢిల్లీ జనవరి 27 (నిఘా న్యూస్): బీజేపీ పాలిత రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి అమల్లోకి వచ్చింది. దీంతో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత యూసీసీ ని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించింది. ఈ సందర్భంగా ప్రతి ఏటా జనవరి 27ని ఉత్తరాఖండ్‌లో యూసీసీ దేగా జరుపుకోనున్నట్లు సీఎం ప్రకటించారు. గతేడాది ఫిబ్రవరి 7న యూసీసీ బిల్లుకు ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఆమోదం పొందింది. 2024, మార్చి 11 ఆ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఓకే చెప్పిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మార్చి 12న నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి పౌర స్మృతి 2024 చట్టాన్ని ఈ ఏడాది జనవరిలో పూర్తిగా అమలు చేయనున్నట్లు అందులో పేర్కొన్నారు. దీని అమలు కోసం ప్రత్యేక పోర్టల్, మొబైల్ యాప్ ఏర్పాటు చేశారు. మహిళలు, పిల్లల సాధికారతే లక్ష్యంగా యూసీసీ అమలు ఉంటుందని సీఎం ధామి గతంలో తెలిపారు. కాగా, పోర్చుగీస్ పాలనలో ఉన్నప్పటి నుంచి గోవాలో ఉమ్మడి పౌరస్మృతి అమల్లో ఉంది.

## జగన్ కేసులో రఘురామ పిటిషన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ జనవరి 27 (నిఘా న్యూస్): సుప్రీం కోర్టులో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి భారీ ఊరట లభించింది. వైఎస్ జగన్ బెయిల్‌ను రద్దు చేయాలంటూ మరోవైపు జగన్ పై ఉన్న కేసులను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు గతంలో వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. రఘురామ కృష్ణంరాజు పిటిషన్ పై జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మల ధర్మాసనం విచారణ జరిపింది. చివరకు ఆ పిటిషన్‌ను డిస్మస్ చేస్తున్నట్టు వెల్లడించింది.. ఇక, జగన్ బెయిల్ ను రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్ ను ఉపసంహరించుకున్నారు పిటిషనర్.. ఈ పరిణామాలతో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించినట్టు అయ్యింది..అయితే కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. జగన్‌ను కేసులను రోజు వారీ విచారణ చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. జగన్ కేసుల బదిలీకి నిరాకరించిన సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టులో జగన్ అక్రమాస్తుల కేసు పర్యవేక్షణ నేపథ్యంలో వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే జగన్ బెయిల్‌ను రద్దు చేయాలన్న పిటిషన్‌పై కూడా ప్రత్యేకంగా విచారణ అవసరం లేదని చెప్పింది. గతంలో సుప్రీంకోర్టు ఎమ్మెల్యే, ఎంపీల కేసుల విషయంలో ఇచ్చిన తీర్పు ఈ కేసుకు కూడా వర్తిస్తుందని సుప్రీం ధర్మాసనం తేల్చిచెప్పింది. ట్రయల్ కోర్టు రోజు వారీ విచారణకు తీసుకోవాలని, హైకోర్టు కూడా పర్యవేక్షణ చేయాలని అందువల్ల మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర మిశ్రా ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామని రఘురామ తరఫు న్యాయవాది బాలాజీ సుబ్రహ్మణ్యం కోర్టుకు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ బెయిల్ రద్దు, కేసుల ట్రయల్ విచారణ ధర్మాసనం మార్పు చేయాలని రఘురామ కృష్ణరాజు సుప్రీం కోర్టులో ఓ



పిటిషన్ వేశారు. గతంలో ఈ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం విచారించగా, ఆ తర్వాత జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనం ముందుకు వెళ్లింది. గత 12 ఏళ్లుగా ట్రయల్ ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదని, ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్ కూడా డిస్పోజ్ చేయలేదని రఘురామ తరపు న్యాయవాది బాలాజీ సుబ్రహ్మణ్యం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బదిలీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు గత విచారణలోనే చెప్పిందని, తాము ఇప్పుడు కేసు మానిటరింగ్ పూర్తి స్థాయిలో జరగాలని కోరుతున్నామని తెలిపారు. అయితే సీబీఐ కేసుల వివరాలు, ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ సీబీఐ అఫిడవిట్ దాఖలు చేసిందని దర్యాప్తు సంస్థ తరపు న్యాయవాది పేర్కొన్నారు. మరోవైపు ఈ కేసును హైకోర్టు మానిటర్ చేస్తోందని, ఇంకా కేసు అక్కడ పెండింగ్‌లో ఉందని జగన్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు. అన్నివైపులా వాదనలు విన్న ద్విసభ్య ధర్మాసనం చివరకు రఘురామ పిటిషన్‌ను డిస్మస్ చేస్తూ ద్విసభ్య ధర్మాసనం ఇవాళ తీర్పు ఇచ్చింది.

## టిడిపిలోకి విజయసాయి రెడ్డికి నో ఎంట్రీ

మొదటి పేజీ తరువాయి...

లక్ష్యమని అన్నారు. సాక్షిపై పరువు నష్టం కేసులో విశాఖ కోర్టుకు ఆయన హాజరయ్యారు. కేసు విచారణ ఫిబ్రవరి 28కి వాయిదా పడింది. కోర్టుకు హాజరైన అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు. 2019లో సాక్షి పత్రిక తనపై అసత్య ఆరోపణలు చేసిందని మంత్రి నారా లోకేశ్తెలిపారు. అప్పుడే వారికి లీగల్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. గత ఐదు సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేస్తున్నాను. ఇది నాలుగో వాయిదా నిజం నా వైపు ఉంది. ఎన్ని సార్లయినా వస్తాను. ఆలస్యమైనా నిజం గెలుస్తుంది. ఈరోజు కూడా మంత్రి హోదాలో నేను వచ్చినప్పుడు పార్టీ ఆఫీసులో బస్సులో పడుకొని సొంత భోజనం తిన్నాను. ప్రభుత్వం నుంచి ఒక్క వాటర్ బాటిల్ కూడా తీసుకోలేదు. వచ్చిన వాహనం కూడా నాదే. సొంత డబ్బుతో డీజిల్ కొట్టించుకున్నా. ఎక్కడా ప్రభుత్వంపై ఆధారపడకూడదని నా తల్లి భువనేశ్వరి చిన్నప్పటి నుంచి నేర్పించారు. సీఎం చంద్రబాబు నాకు ఏ బాధ్యత ఇచ్చినా అహర్నిశలు కష్టపడతా. నావల్ల పార్టీకి ఏనాడూ చెడ్డపేరు రాకుండా చూసుకుంటా. 'యువగళం' పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు చర్యలు తీసుకుంటాం. తల్లి, చెల్లినే నమ్మని జగన్.ఎవరినీ నమ్మరు. డబ్బు కోసం ఆయన పార్టీనే అమ్మేసే రకం. ఇవన్నీ చూసే ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. మా పార్టీని, కార్యకర్తలను విజయసాయిరెడ్డి ఇబ్బంది పెట్టారు. అలాంటి వ్యక్తి తెదేపాలోకి వస్తానంటే ఎందుకు తీసుకుంటాం.విశాఖలో విజయసాయి చేసిన అక్రమాలపై విచారణ జరుగుతోంది. రెడ్‌బుక్ గురించి నేను చెప్పిన విషయం చాలా స్పష్టం. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయి' అని లోకేశ్ అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ టీమ్ దావోస్ పర్యటనపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్న వేళ మంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏడు నెలలలో ఆరు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తీసుకొచ్చామని స్పష్టం చేశారు.. ఇక, 2019లో బ్లూ మీడియా నాపై అసత్య కథనం ప్రచురించింది. తప్పుడు కథనంపై సమాధానం చెప్పాలని అప్పుడే నేను లీగల్ నోటీసు జారీ చేశాను అన్నారు. మరోవైపు తన పాదయాత్రకు రెండేళ్లు అయిన సందర్భంగా రాజకీయాలలో పాదయాత్ర ఎంబీఏ లాంటిది అని పేర్కొన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటు వస్తున్నాము. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతుంది. విశాఖలో జరిగిన అక్రమాలపై కూడా విచారణ సాగుతోంది. అన్ని వ్యవహారాలపై విచారణ ఒకేసారి జరిగితే ఉన్న పోలీసులు సరిపోరు. క్రమంగా అన్నింటిపై విచారణ జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1997 నుంచి దావోస్ కి వెళ్తున్నారని గుర్తుచేసిన ఆయన, గత ప్రభుత్వంలో ఒప్పందాలు జరిగితే ఎందుకు పరిశ్రమలు స్థాపించ లేకపోయారని నిలదీశారు. మహారాష్ట్రకు ఎక్కువ పెట్టుబడుల రావడానికి కారణం ఒకే ప్రభుత్వం కొనసాగడంగా పేర్కొన్న ఆయన. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెట్టుబడులు పెట్టిన సంస్థల ప్రతినిధులను గతంలో జగన్మోహన్ రెడ్డి కలవలేదని దుయ్యబట్టారు. గుజరాత్ లో 5వ సారి బీజేపీ ప్రభుత్వం రావడం వలన అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు.మన రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు అభివృద్ధిని పరుగులు పెట్టించాం. రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి గెలవాల్సి ఉందన్నారు. చంద్రబాబుపై మాకు నమ్మకం ఉంది. కానీ, రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గెలవలేరని హామీ ఇవ్వగలరా అని దావోస్ ప్రతినిధులు అడుగుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలి. పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి తీసుకు రావడానికి చాలా కష్టపడుతున్నాం అన్నారు. మరోవైపు రోజాపై సెటైర్లు వేసిన లోకేష్.. అసలు రోజా కు దావోస్ కు జ్యూరిచ్ కు తేడా తెలియదు అని ఎద్దేవా చేశారు. రెడ్ బుక్ కోసం ఎందుకు వైసీపీ నాయకులు భయపడుతున్నారని ప్రశ్నించారు.ఇక, విశాఖలో 90 రోజులలో టీసీఎస్ ను ఏర్పాటు చేస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు.

## కిడ్నీ రాకెట్‌లో... డాక్టర్ల కోసం పోలీసుల గాలింపు

### ఇప్పటి వరకు 9మందిని అరెస్టు చేసిన పోలీసులు

హైదరాబాద్ జనవరి 27(నిఘా న్యూస్): తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేపిన కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఎల్బీనగర్ వేదికగా అలకనంద హాస్పిటల్‌లో గుట్టుగా సాగుతున్న కిడ్నీ మార్పిడి రాకెట్ గుట్టు తేల్చారు పోలీసులు. ఈ కేసులో ఇప్పటివరకు 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో చాలామంది డాక్టర్లు కూడా ఉన్నారు. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇక్కడ ఎలాంటి ఇన్కమ్ లేక పోవడంతో కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ చేసి డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ అవినాష్, డాక్టర్ సుమంత్ ఇద్దరూ కలిసి భారీగా కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్లు చేశారు. మొదట డా. అవినాష్ సైదాబాద్‌లో జననీ హాస్పిటల్‌ను స్థాపించాడు. అందులో ఆయనకి ఆశించినంత సక్సెస్ రాకపోవడంతో 2022లో హాస్పిటల్ మూసేశాడు. తర్వాత డాక్టర్ సుమంత్ పరిచయం కావడంతో ఇద్దరు కలిసి సరూర్‌నగర్‌లో అలకనంద హాస్పిటల్ స్థాపించారు. ఈ హాస్పిటల్‌లో గుట్టు చప్పుడు కాకుండా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించేవారు. ఆరు నెలల వ్యవధిలో సుమారు 20కి పైగా కిడ్నీ ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్ల నిర్వహణ కోసం ఇతర రాష్ట్రాల నుంచి సర్జరీ నిర్వహించే డాక్టర్లను అలకనంద హాస్పిటల్‌కు రప్పించారు. సర్జరీ చేసే వైద్యుల్లో కీలకంగా తమిళనాడుకు చెందిన డాక్టర్ రాజశేఖర్‌తో పాటు జమ్ము కాశ్మీర్‌కు చెందిన డాక్టర్ సాహెబ్ ఉన్నారు. కిడ్నీలను డొనేట్ చేసేందుకు ఎక్కువగా పేద కుటుంబానికి చెందిన వారే ఆసక్తి చూపిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కిడ్నీ అమ్మితే లక్షల రూపాయలు వస్తాయని ఆశపడి ఎలాంటి నిబంధనలు లేకున్నా సరే ఈ తరహాలో ప్లాన్ చేస్తున్నారు. ఒక్కో కిడ్నీ ఆపరేషన్‌కు దళారులు 60 లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. వీటిలో కిడ్నీ డొనేట్ చేస్తున్న వ్యక్తికి కేవలం 5 లక్షల రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. కిడ్నీ ఆపరేషన్ చేసిన వైద్యుడికి ఒక్కో డాక్టర్‌కు 10 లక్షల రూపాయల చొప్పున ఇస్తున్నారు. మధ్యవర్తులు, ఏజెంట్లకి ఒక్కో ఆపరేషన్‌కు 30 వేల రూపాయలు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 15 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. వీరిలో మరో ఆరుగురు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. మెయిన్ సర్జరీ చేసిన ఇతర డాక్టర్ల కోసం రాచకొండ పోలీసులు గాలిస్తున్నారు. వీరిని పట్టుకునేందుకు చెన్నైతోపాటు జమ్ము కాశ్మీర్ కు ఎస్ఓటి బృందాలు వెళ్లినట్టు సమాచారం.

## ఈటల రాజేందర్... నక్సలైట్ కాదు

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వం ఇవ్వాలను కుంటున్న గద్దర్ అవార్డులు మా వాళ్ళు తీసుకోరని బండి సంజయ్ స్పష్టం చేశారు. గద్దర్ కాంగ్రెస్, టీడీపీకి చెందిన నేతలను హతమార్చారని. ఆ విషయం సీఎం రేవంత్ రెడ్డికి తెల్వదని అన్నారు. గద్దర్‌కు వ్యతిరేకంగా మాట్లాడానని నా దిష్టి బొమ్మ తగలబెడితే నా ఆయుష్షే పెరుగుతుందని సెటైర్ వేశారు కేంద్రమంత్రి బండి సంజయ్. 'గద్దర్ ఎంత మంది బీజేపీ కార్యకర్తలను కాల్చి చంపించారో తెలియదా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేసిన వందల మంది బీజేపీ కార్యకర్తలను నక్సల్కెట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందని, తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో, ఎవరు బల్కెపోయారో ప్రజలందరికీ అర్థమైందని అన్నారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన పద్మ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాము గోరటి వెంకన్న, గద్దర్, జయధీర్ తిరుమలరావు, చుక్కా రామయ్య, అందెశ్రీ పేర్లు సిఫార్సు చేసినా కేంద్రం పట్టించుకోలేదని రేవంత్ విమర్శించారు. ఏపీకి ఐదు అవార్డులు ఇచ్చారని, తెలంగాణకు నాలుగైనా ఇవ్వాల్సిందని అన్నారు. పద్మ అవార్డుల విషయంలో చూపిన వివక్షపై కేంద్రానికి లేఖ రాస్తానని సీఎం అన్నారు. సీఎం వ్యాఖ్యలపై తాజాగా బండి సంజయ్ ఈ హాట్ కామెంట్స్ చేశారు. పద్మ అవార్డులు అర్హులకే వచ్చాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి పేర్లు పంపితే కేంద్రం పరిశీలిస్తుందని, ఏ పేరు పడితే ఆ పేరు పంపితే పద్మ అవార్డులు ఇవ్వరని సంజయ్ అన్నారు. 'గద్దర్‌కి పద్మ అవార్డు ఎలా ఇస్తాం. ఆయన భావజాలం ఏంటి.బరాబర్ గద్దర్‌కు ఇవ్వం. ఎందరో బీజేపీ నేతలను చంపిన వ్యక్తుల్లో గద్దర్ ఒకరు. పద్మ అవార్డులు స్థాయి ఉన్న వారికే ఇస్తాం. బీజేపీ కార్యకర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఎలా ఇస్తాం అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

## రైతు భరోసాను జమ చేసిన ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి...

రూ.530 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా ఇస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రోజు 15,414 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి తుమ్మల చెప్పారు. 'కొత్త కార్డుల్లో 51,912 మందికి ఫిబ్రవరి నుంచి రేషన్ పంపిణీ చేస్తాం. తొలి రోజు మండలానికి ఒక గ్రామం చొప్పున కొత్త రేషన్ కార్డులు జారీ చేశాం. పాత రేషన్ కార్డుల్లో అదనంగా 1.03 లక్షల మంది పేర్లు చేర్చారు. 501 గ్రామాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభమైంది. మొదటి రోజు 20,336 మంది భూమిలేని కూలీలకు నిధులు విడుదలయ్యాయి' అని తెలిపారు. ఈ ఏడాది రైతుభరోసా కింద ప్రతి ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనున్నట్లు మంత్రి తుమ్మలచెప్పారు. భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రెండు విడతలుగా రూ.12 వేలు ఇస్తామని పేర్కొన్నారు. రైతులకు యాసంగికి పెట్టుబడి సాయం, కూలీలకు రూ.6 వేలు ఖాతాల్లో పడతాయని వివరించారు. సోమవారం నుంచి బ్యాంకుల్లో నగదు తీసుకోవచ్చన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నా రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామన్నారు. అందుకు రూ.21 వేల కోట్లు చెల్లించామని ప్రకటించారు. పథకాల అమలు నిరంతర పక్రియ అని అన్నారు. అర్హులైన అందరికీ పథకాలు వస్తాయని స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదికి 3,500 ఇళ్లు మంజూరవుతాయని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్నారు.

# పదవి ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజాక్షేత్రంలోనే

## కౌన్సిలర్ తుడుం గణేష్



**మేడ్చల్, జనవరి 27 (నిఘా న్యూస్):** మేడ్చల్ మున్సిపాలిటీ 4వ వార్డులోని గురుకుల పాఠశాల వద్ద డ్రైనేజీ పైప్ లైన్ వేయించడం జరిగిందని కౌన్సిలర్ తుడుం గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ తుడుం గణేష్ మాట్లాడుతూ సరైన డ్రైనేజీ లేక వీకర్ సెక్షన్ కాలనీ వాసులు, గురుకుల పాఠశాల విద్యార్థులు దోమల బెడదతో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ డ్రైనేజీ ఏర్పాటుతో వీకర్ సెక్షన్ కాలనీ, గురుకుల పాఠశాల డ్రైనేజీ సమస్య తీరనుందని చెప్పారు. దీనికి సహకరించిన మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి, కమిషన్ నాగిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అదేవిదంగా తాను కౌన్సిలర్ ఎన్నికైన నాటి నుండి ఇన్ని సంవత్సరాలు చేసిన అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. ప్రత్యేకంగా వార్డు అభివృద్ధికి మాజి మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. నీను చేసిన ప్రతి పనిలో పూర్తి సహకారం అందించిన మల్లారెడ్డి కి రుణపడి ఉంటానన్నారు. తనపై నమ్మకంతో కౌన్సిలర్ గా గెలిపించిన వార్డు ప్రజలకు పదవి అయిపోయినా గాని ఎప్పటికి అందుబాటులో ఉంటానన్నారు.

# ఘనంగా ఎలక్ట్రీషియన్ "డే" వేడుకలు



**గోకవరం, జనవరి 27 (నిఘా న్యూస్):** మండల కేంద్రమైన గోకవరంలోగోకవరం యునైటెడ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ జనవరి 27వ తారీకు ఎలక్ట్రిషన్ డే గా పరిగణించి ఘనంగా వేడుక జరుపుకోవడం జరిగింది. తదుపరి జెండా ఆవిష్కరణ చేసి అందరికీ స్వీట్స్ కంచి పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యవర్గసభ్యులు, ఎలక్ట్రిషన్ సభ్యులు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం




**హబ్సిగూడ, జనవరి 27 (నిఘా న్యూస్):** శాఖపరమైన మరమ్మత్తులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఈనెల 28వ తేదీ మంగళవారం 11 కెవి లక్ష్మీ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హబ్సిగూడ విద్యుత్ శాఖ ఏఈ వి.గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కెవి రవీంద్ర నగర్ ఫీడర్, స్ట్రీట్ నెంబర్ 8 హబ్సిగూడ సబ్స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆ సమయంలో మహేశ్వరి నగర్, ఎస్ఎస్ నగర్, జెఎస్ఎన్ కాలనీ, రవీంద్ర నగర్, సెయింట్ జోసెఫ్ లైన్ కొంత భాగం సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు, వ్యాపారస్తులు, తమతో తమ సిబ్బందితో సహకరించాలని ఏఈ గణేష్ విజ్ఞప్తి చేశారు.

# మృతుని కుటుంబానికి చేయూత



**ముస్తాబాద్, జనవరి 27 (నిఘా న్యూస్):** ముస్తాబాద్ మండలం మోర్రాయిపల్లి గ్రామానికి చెందిన గుండం దేవేందర్ అనే వ్యక్తి దుబాయ్ లో గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎన్నారై మిత్ర మండలి బృందం మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎన్నారై మిత్ర మండలి సభ్యులు పర్స తిరుపతి, జిల్లెల్ల భూపతి, వేముల సతీష్,నాగరాజు, నర్సింహా రెడ్డి, ఎల్లం, సామాజిక కార్యకర్త జనగామ శ్రీనివాస్, చెవుల మైలారం యాదవ్ పాల్గొన్నారు.


# క్లాసిక్ బాడీబిల్డింగ్ విజేతలకు సన్మానం



**మల్లాపూర్, జనవరి 27 (నిఘా న్యూస్):** మల్లాపూర్ డివిజన్ వివిఎన్ఆర్ గార్డెన్స్ లో జిఎస్ ఫిట్నెస్ స్టూడియో గౌతమ్, అభి ఫిట్నెస్ స్టూడియో అభి ఆధ్వర్యంలో నిర్వహించిన బాడీబిల్డింగ్ పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొని విజేతలకు ట్రోఫీలను, మెడల్స్ ను ప్రదానం చేశారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు బాడీ బిల్డర్ లను సిద్ధం చేయడమే తమ లక్ష్యమని ముందుకు సాగుతున్న ఏజీ క్లాసిక్ నిర్వాహకులు గౌతమ్, అభిషేక్, పరమేశ్ వెంకట్ ను అభినందించారు.

# పోచారం బ్రాండ్ అంబాసిడర్ చింతల రాజశేఖర్

## మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



**ఘట్ కేసర్, జనవరి 27 (నిఘా న్యూస్):** పోచారం మున్సిపాలిటీ బ్రాండ్ అంబాసిడర్ గా ఎదిగిన చింతల రాజశేఖర్ ను అభినందించిన మాజీ మంత్రి, స్థానిక ప్రస్తుత ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి. పోచారం మున్సిపాలిటీ పాలకవర్గంలో మూడో వార్డు కౌన్సిలర్ గా ఎన్నికైన చింతల రాజశేఖర్ ఐదు సంవత్సరాలు పదవికాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా వారి నివాసంలో కలిసి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజశేఖర్ ఒక జర్నలిస్టు, ఒక రైతు, ఒక సంఘ సేవకుడు, ఒక సినీ నిర్మాత, ఒక సినీ డైరెక్టర్ ఎన్నో కలలు ఉన్న ఇతనికి పోచారం మున్సిపాలిటీ స్వచ్ఛ సర్వేక్షణ ఆధ్వర్యంలో బ్రాండ్ అంబాసిడర్ గా ఎంపిక చేయడంతో నాటి కమిషనర్ ఎర్రోళ్ల సురేష్, చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి చేతుల మీదుగా బ్రాండ్ అంబాసిడర్ సర్టిఫికెట్ అందుకున్నాడని ఆయన గర్వంగా చెబుతూ అభినందించారు. నిత్యం ప్రజలతో మమేకమై ఉండి వారి వారి సమస్యలను పరిష్కరిస్తూ, జర్నలిస్టుగా ఎంతోమంది శిష్యులను తయారు చేసి ప్రజల సమస్యలపై పోరాటం చేసే విధంగా తయారుచేసిన మహనీయుడని ఆయన కొనియాడారు. ప్రస్తుతం కౌన్సిలర్ పదవి కాలం ముగించిన జర్నలిస్టుగా తిరిగి ప్రజలకు సేవ చేసేందుకు కలం పట్టుకున్నారని ఆయన అన్నారు. సినీ రంగంలో ఎదగాలని ఆయన ఆశీర్వదిస్తున్నానని ఆయన తెలిపారు. రాబోయే రాజకీయాలు ఏ విధంగా ఉంటాయో ఆ పరిస్థితులను బట్టి అడుగులు వేయాలని ఆయన రాజశేఖర్ కు సూచించారు. ఈ సందర్భంగా చింతల రాజశేఖర్ మాట్లాడుతూ వార్డు అభివృద్ధికి సహకరించిన మాజీ మంత్రి మల్లారెడ్డికి, చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డికి, వైస్ చైర్మన్ నవావత్ రెడ్యా నాయక్ కు, పోచారం మున్సిపాలిటీ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మందడి సురేందర్ రెడ్డి కి, కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# సిపియస్ రద్దు కోరుతూ తహసీల్దార్ కు వినతిపత్రం



**తూప్రాన్, జనవరి 27 (నిఘా న్యూస్):** కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం సి.పి.యస్ కు ప్రత్యా మ్నాయంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యునైటెడ్ పెన్షన్ పథకం యు.పి.ఎస్ పథకంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేరకుండా సిపిఎస్ ను పూర్తిగా రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ స్కీం పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తూప్రాన్ మండల పి.ఆర్.టి.యు.టి.యస్ నాయకులు స్థానిక మండల తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఏప్రిల్ 25 నుండి కేంద్రప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధపడి, రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయం కోరిన సందర్భంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ తీవ్ర నిరసనను తెలియచేస్తూ నేడు పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి యు.పి.యస్ కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కేంద్రప్రభుత్వం తీసుకురానున్న యు.పి.యస్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకించి, మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా సి.పి.యస్ ను పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ఉపాధ్యాయులకు వర్తింప చేయాలని కోరారు. కార్యక్రమంలో తూప్రాన్ మండల పి.ఆర్.టి.యు.టి.యస్ అధ్యక్షులు రమేష్ గంగాల, ప్రధాన కార్యదర్శి సంగిడి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

# గోకవరంలో క్రిస్టియన్ పాస్టర్స్ సమావేశం



**గోకవరం, జనవరి 27 (నిఘా న్యూస్):** గోకవరం మండల కేంద్రమైన గోకవరం గ్రామంలో స్థానిక తానా సెంటర్ వద్దనున్న అంబేద్కర్ భవనంలో క్రిస్టియన్ పాస్టర్ల పెద్దల సమావేశం నిర్వహించడం జరిగినది. గ్రామ పెద్దలు ముఖ్య అతిథులుగా పాల్గొనిన ఈ కార్యక్రమంలో గోకవరంలో ఉన్నటువంటి స్మశాన వాటిక అభివృద్ధి నిమిత్తము ఎస్సీ ఎస్టీ బీసీ ఇతర క్రైస్తవులు ఒకరినొకరు సహకరించుకుంటూ ముందడుగు వేయవలసిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ఎంతో దైవంగా భావించుకునే సమాధుల తోట చూడకూడని చెప్పలేని పరిస్థితులలో ఉన్నదని ఇందు నిమిత్తం స్థానిక ప్రభుత్వం ద్వారా నిధులు తెచ్చుకునే విధంగా కార్యక్రమం చేపట్టాలని కోరారు. నియోజకవర్గ శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ద్వారా ఈ కార్యక్రమం జరిపించుకుంటూ స్థానిక అధికారులను నాయకులను కార్యకర్తలను కలుపుకుంటూ భావితరాలకు కూడా ఉపయోగపడే విధంగా సమాధులతోట కోసం ఐకమత్యంతో ముందుకు సాగాలని ఈ సమావేశంలో తెలియజేసి ఉన్నారు. ఈ సందర్భంగా మా వంతు సహకారం చేయుదుమని స్థానిక పాస్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని సంఘాల పాస్టర్లు క్రిస్టియన్ యువత పాల్గొన్నారు.

# మేడ్చల్ కౌన్సిల్ సభ్యులను సన్మానించిన ఈటల




**మేడ్చల్, జనవరి 27 (నిఘా న్యూస్):** మేడ్చల్ మునిసిపల్ కార్యాలయంలో మల్కాజ్గిరి పార్లిమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో మునిసిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక రెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. వివిధ అభివృద్ధి, మెంటెనెన్స్ పనులకు సంబంధించిన అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది. అనంతరం మేడ్చల్ మున్సిపాలిటీ తొలి పాలక వర్గ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ కౌన్సిల్ సభ్యులకు సన్మానం నిర్వహించారు.అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ మేడ్చల్ మునిసిపల్ ఏర్పాటు తర్వాత ఎన్నికైన మొదటి పాలక వర్గం, మేడ్చల్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ప్రజల ఆశీర్వాదంతో మళ్లి సభ్యులంతా ఎన్నిక కావాలని కాంక్షించారు. చైర్ పర్సన్ మర్రి దీపిక రెడ్డి మాట్లాడుతూ ఎల్లపుడు ప్రజలలో ఉండే నాయకురాలినని, పదవి ఉన్న లేకపోయినా ఎల్లప్పుడు మేడ్చల్ పట్టణ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్ చీర్ల రమేష్, కమిషనర్ బి. నాగిరెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, మునిసిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కౌన్సిలర్ ను సన్మానించిన వార్డు ప్రజలు



**తూప్రాన్, జనవరి 27 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు కౌన్సిలర్ బొంది అరుణను గణతంత్ర దినోత్సవ సందర్భంగా పడాల పల్లిలోని వివిధ పార్టీల నాయకులు బిఆర్ఎస్ యువత, యువకులు సన్మాన కార్యక్రమాన్ని చేపట్టినారు. గ్రామంలోని యువకులు పార్టీలకతీతంగా శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. గడచిన ఐదు సంవత్సరాల కాలంలో పడాలపల్లి 11వ వార్డుకు వారు చేసిన సేవ చిరస్మరణీయమని 11వ వార్డులోని పలువురు నాయకులు, యువకులు, వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బొంది వెంకట గౌడ్ మాట్లాడుతూ గడచిన ఐదు సంవత్సరాల కాలంలో పడాలపల్లి గ్రామాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయడం జరిగింది ఇది కేవలం నా మాటలు మాత్రమే కావని అభివృద్ధి మీ కళ్ళముందు ఉన్నదని వారు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను ప్రజల ఆశీస్సులతో సాధించిందే గాని మా ఘనత కాదని ఈ సందర్భంగా బొంది వెంకట్ గౌడ్ తెలిపారు. వార్డు ప్రజలు మాట్లాడుతూ వెంకట్ గౌడ్ చేసిన సేవను గుర్తించి మెదక్ కలెక్టర్ కార్యాలయంలో మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారని వివరించారు.

# మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్రోలకు సన్మానం



**మేడ్చల్, జనవరి 27 (నిఘా న్యూస్):** మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించిన గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ తొమ్మిదవ వార్డుకు చెందిన ఎర్రోల శ్రీనివాస్ విజయను ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు, జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్ వై అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో పదవులను పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల కోసం కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఎర్రోళ విజయ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా తన బాధ్యత నిర్వహిస్తూ, పేదల కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కేశపాగ రామచందర్, యువసేన అధ్యక్షులు పరుశురాం మాదిగ, జిల్లా నాయకులు బాల నరసింహ మాజీ మండల అధ్యక్షులు ఎర్రోళ్ల యాదయ్య, రామ్ చందర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రామకృష్ణ, శివ సురేష్, శంకర్, బాలకృష్ణ, సత్యనారాయణ, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# మూడవ వార్డులో వాటర్ పైప్ లైన్ ప్రారంభం



**మేడ్చల్, జనవరి 27 (నిఘా న్యూస్):** మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డులో గల బ్రాడ్ వే వెంచర్ కాలనీలో 10 లక్షల రూపాయలతో వాటర్ పైప్ లైన్ కోసం, రాఘవేంద్ర నగర్ కాలనీ రోడ్డు నెంబర్ 5 కాలనీలో వాటర్ పైప్ లైన్ మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికారెడ్డితో కలిసి, మేడ్చల్ మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ జాకట దేవరాజ్ వాటర్ పైప్ లైన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు ఆరె గీత, వంజరి,3వ వార్డు, బ్రాడ్ వే వెంచర్ కాలనీ వాసులు, కె ఎల్ ఆర్ వెంచర్ కాలనీ వాసులు, పుర ప్రముఖులు, యువకులు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# పొంగి పొర్లుతున్న డ్రైనేజీ పట్టించుకోని అధికారులు

## ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ నేత ఎర్రం శ్రీనివాస్



**రామంతపూర్, జనవరి 27 (నిఘా న్యూస్):** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతపూర్ నందుగల కెసిఆర్ నగర్ నుండి నాగోల్ మెట్రో స్టేషన్ వెళ్లే ప్రధాన రహదారి సర్వీస్ రోడ్డుపై, శ్రీరామ కాలనీ వద్ద డ్రైనేజీ సమస్య ప్రజలను చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది. నెలలు గడుస్తున్న సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రధాన రహదారిపై రోజుకు కొన్ని వేల వాహనాలు వస్తూపోతూ ఉంటాయి. స్కూల్ పిల్లలు ,పాదచారులు వెళుతూ ఇబ్బందులకు లోనవుతున్నారు. ఈ రోడ్డుపై అధికారులు పాలకులు వెళుతూ ఉంటారు కానీ ఈ సమస్య ఎవరికీ పట్టడం లేదు. డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ నాయకులు ఎర్రం శ్రీనివాస్ జిహెచ్ఎంసి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# పద్మారావును పరామర్శించిన జిఎంఆర్



**పటాన్‌చెరు, జనవరి 27 (నిఘా న్యూస్):** ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ మంత్రి, తెలంగాణ మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ శాసన సభ్యులు పద్మారావు గౌడ్ ను, సికింద్రాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించిన పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి భగవంతుడి కృపతో అతి త్వరగా కోలుకొని ప్రజా సేవలో పాల్గొనాలని ఆయన అభిలషించారు.

# రహదారి భద్రతపై డ్రైవర్లకు అవగాహన



**ఉప్పల్, జనవరి 27 (నిఘా న్యూస్):** రోడ్డు భద్రతపై డ్రైవర్లు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉప్పల్ ట్రాఫిక్ సిఐ లక్ష్మీ మాధవి సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం జిహెచ్ఎంసి డంపింగ్ యార్డ్ డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ పై ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ. లక్ష్మీ మాధవి మాట్లాడుతూ వాహనాలను నడిపే డ్రైవర్లు మద్యం సేవించి, సెల్ ఫోన్ తో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, ప్రతి వాహనాలకు రికార్డులు సక్రమంగా ఉండాలని, ఇన్సూరెన్స్ విధిగా చేయించాలని, మోటార్ వెహికల్ ఆక్ట్ రూల్స్ ప్రకారం విధులు సక్రమంగా పాటించాలని సూచించారు. అతివేగం ప్రమాదకరమని, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్నప్పుడు కుటుంబ సభ్యులు మనకోసం ఎదురు చూస్తూ ఉంటారని ఆలోచించాలని పేర్కొన్నారు.

# చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు




**ముస్తాబాద్, జనవరి 27 (నిఘా న్యూస్):** ముస్తాబాద్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో న్యాయ చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఉచిత న్యాయ సహాయం, కుటుంబ తగాదాలు, రైతులు సాగు చట్టాలు సహాయం, ఎఫ్ ఐ ఆర్, సైబర్ క్రైమ్, పోక్సో వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అడ్వకేట్ సంతోష్ రెడ్డి, మండల పారా లీగల్ వాలంటరీ సంతోష్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొనరావుపేట పార లీగల్ వాలంటర్ లావణ్య, భార్గవి, సంజన, చందన, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లారెడ్డి,జోష్న, జ్యోతి, రాణి పాల్గొన్నారు.

## నరేంద్ర నగర్ లో కార్పొరేటర్ పర్యటన



**అంబర్ పేట, జనవరి 27 (నిఘాన్యూస్):** అంబర్ పేట డివిజన్ నరేంద్ర నగర్ లో సోమవారం కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బస్తి ప్రజలతో కలిసి స్థానికంగా ఉన్నటువంటి రోడ్డు ప్యాచ్ వర్క్ సమస్యలను ఆయన పరిశీలించారు. ఇటీవల బస్తీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్లో వాటర్ బోర్ వేయించాలని ప్రజలు కార్పొరేటర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే నూతన సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తామని, ఎమ్మెల్యేతో మాట్లాడి వాటర్ బోర్ కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానిక బస్తి ప్రజలు స్వాతి, జయమ్మ, ఈ.స్వాతి, రేఖ, అనసూయ, విజయలక్ష్మి, లతా, లావణ్య, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ గణపతి స్వామి అన్న దానానికి 25వేల విరాళం



**బిక్కవోలు, జనవరి 27 (నిఘా న్యూస్):** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బిక్కవోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి దేవస్థానంలో సోమవారం కృష్ణా జిల్లా ఉయ్యూరు గ్రామ వాస్తవ్యులు కొల్లి దేదీప్ సాయి కుటుంబ సభ్యులు స్వామివారి శాశ్వత అన్నదాన నిమిత్తం 25 వేల రూపాయలు విరాళంగా అందించారని ఆలయ కార్య నిర్వహణాధికారి ఏ ఎస్.బి.జి రామలింగం భాస్కర్ తెలియజేశారు.

## లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఎంపీడీవోకు వినతి పత్రం

### మాజీ సర్పంచి మద్దెల మంజుల



**యాదాద్రి, జనవరి 27 వలిగొండ (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కెర్చిపెల్లి నాలుగు సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేయాలని కెర్చిపల్లి మాజీ సర్పంచ్ మద్దెల మంజుల ఆధ్వర్యంలో ఎంపీడీవో జితేందర్ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మంజుల నాగరాజు మాట్లాడుతూ రేషన్ కార్డులు,రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,ఇందిరమ్మ ఇండ్లు, ఈ సంక్షేమ పథకాల ఇంటింటి సర్వే తప్పుల తడకగా ఉందని రీ సర్వే చేసి నిజమైన లబ్ధిదారులను గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు జంగయ్య, కల్లెం అశోక్ రెడ్డి, నరసింహా చారి, కంచి అంజయ్య, కోన అశోక్, కల్లెం శ్రీకాంత్ రెడ్డి, గుండు రాజారెడ్డి, దొడ్డారపు సురేష్, బండారి లక్ష్మయ్య, కొండయ్య, కంచి నరసింహా, కంచి రమేష్, మహిళా నాయకులు ప్రేమలత, పర్వతమ్మ, ధనమ్మ, కంచి సుశీల, కంచి భాగ్య, చంద్రకళ, భూలక్ష్మి, అలివేల, కలుకూరి బాలమ్మ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసిన ఎక్సైజ్ అధికారులు



**రంగంపేట, జనవరి 27 (నిఘా న్యూస్):** అనపర్తి నియోజకవర్గం రంగంపేట మండలం మర్రిపూడి గ్రామము నందు నాటు సారాయి స్థావారముల పైన దాడులు నిర్వహించి 4 ప్లాస్టిక్ డ్రములలో నాటు సారాయి తయారీకి పనికొచ్చే 800 లీటర్ల బెల్లపు ఊటను కనుగొనడమైనది. సదరు బెల్లపు ఊటను డ్రములతో సహా నేరస్థలము నందే ధ్వంసం చేయడమైనదని రంగంపేట ఎక్సైజ్ సిఐ సుధారాణి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారము మేరకు దాడుల నిర్వహించడం జరిగిందని అందులో భాగంగా 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. నాటు సారా ఎవరు తయారు చేసిన శిక్షార్హులని, అమ్మడం గాని తయారు చేయడం గాని చేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. ఈ దాడిలో ఎక్సైజ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేట్ కు ధీటుగా ఖాజిపల్లి పాఠశాల

- ఆధునిక సౌకర్యాలతో ఆధునాతన భవనం
- సామాజిక సేవలో పరిశ్రమలు మరింత చొరవ చూపాలి
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**జిన్నారం, జనవరి 27 (నిఘా న్యూస్):** కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా కాజిపల్లి గ్రామంలో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిలుస్తుందని, గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండలం ఖాజిపల్లి గ్రామంలో కెమ్ టెక్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో కోటి తొమ్మిది లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో పాఠశాల నిర్మించడం పట్ల పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. పరిశ్రమల యాజమాన్యాలు తమ పరిశ్రమల గ్రామాల పరిధిలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని కోరారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి నూతనంగా నిర్మించిన పాఠశాలలో విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు గ్రామ ప్రముఖులు బాధ్యతతో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పి మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ లు సత్యనారాయణ, నరసింహ, మాజీ ఎంపిటిసి భార్గవ్, పరిశ్రమ ఎండి గుల్లపల్లి గోపికృష్ణ, సంస్థ హెచ్ఆర్ శ్రీనివాస్, గ్రామ పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదు

### శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి




**శేరిలింగంపల్లి, జనవరి 27 (నిఘా న్యూస్):** శేరిలింగంపల్లి జోన్ వ్యాప్తంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. జోనల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, యూబీడీ, వెటర్నరీ, సానిటేషన్ విభాగాల అధికారులతో కలిసి జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి ప్రజావాణిలో అందుబాటులో ఉండి ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. జోనల్ కార్యాలయంలో పలు సమస్యలపై ప్రజల నుంచి 7 వినతులు రాగా జోన్ వ్యాప్తంగా పలు విభాగాలకు సంబంధించి మొత్తం 17 వినతులు అందాయి. అందులో కొన్నింటిని తక్షణమే పరిష్కరించారు. ఈ సందర్భంగా జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకునేందుకు ప్రజావాణి అత్యంత కీలకమైన వేదికన్నారు. ప్రజావాణి సందర్భంగా వారి నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటి పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేసారు. ప్రతి వినతిని విధిగా సర్కిళ్లలో రికార్డులలో నమోదు చేయాలని, నిర్దిష్ట సమయంలో పరిష్కరించి ప్రజలకు సమాచారం అందించాలని జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి సూచించారు. ప్రతి సోమవారం సర్కిళ్లలో డీసీ సహా ఆయా విభాగాల అధికారులు విధిగా ప్రజావాణిలో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, ఈఈ మల్లిఖార్జున్, డీడీ శ్రీనివాస్, విల్సన్, సిటీ ప్లానర్ శ్యామ్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# సబ్ జోన్ క్రీడలలో గన్నవరం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



**గన్నవరం, జనవరి 27 (నిఘా న్యూస్):** ఈ నెల 24,25 తేదీలలో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన గన్నవరం సబ్ జోన్ కీడలలో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించి విజేతలు గా నిలిచారని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జి వి. రవి బాబు సోమవారం పత్రికలకు తెలిపారు. కాగా సీనియర్ బాలుర విభాగంలో ఖో ఖో ప్రధమ స్థానం, జూనియర్ ఖో ఖో ప్రధమ స్థానం, కబడ్డీ జూనియర్స్ విభాగం లో గన్నవరం, మరియు కేసరపల్లి సంయుక్త ప్రధమ స్థానం, షటిల్ బాడ్మింటన్ సీనియర్, జూనియర్ విభాగం లో ప్రధమ స్థానం, త్రో బాల్ సీనియర్ విభాగం ద్వితీయ స్థానం, సాఫ్ట్ బాల్ సీనియర్, జూనియర్ విభాగంలో పాఠశాల జట్లు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు రవి బాబు తెలిపారు. ప్రతిభ కనబరచి సెంట్రల్ జోన్ కు అర్హత సాధించిన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన పాఠశాల వ్యాయమ విద్య సహాయకులు ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్ ను అలాగే స్థానిక సాంఘీక సంక్షేమ వసతి గృహం విద్యార్థులను ప్రోత్సహించిన వార్డెన్ యం.ఐ.ప్రకాష్ ను రవి బాబు తో పాటు పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

# లక్ష్మీనగర్ కాలనీలో కమ్యూనిటీ భవనం

### ప్రారంభించిన కాటా శ్రీనివాస్ గౌడ్ దంపతులు



**అమీన్ పూర్, జనవరి 27 (నిఘా న్యూస్):** అమీన్ పూర్ మున్సిపల్ 13 వార్డు పరిధిలోని సృజనలక్ష్మీ నగర్ కాలనీలో పటాన్ చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీ కాటా శ్రీనివాస్ గౌడ్, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, 15 వార్డు కౌన్సిలర్ కాటా సుధా గౌడ్ దంపతులు రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసి, భరత జాతి ఔన్నత్యాన్ని కొనియాడారు. తదనంతరం కౌన్సిలర్ జి.లావణ్య రెడ్డి తమ సొంత నిధులు 15 లక్షల రూపాయలతో సృజన లక్ష్మీ నగర్ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని శ్రీనివాస్ గౌడ్ దంపతులు ప్రారంభించారు. కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించటానికి విచ్చేసిన దంపతులకు సృజన లక్ష్మీ నగర్ కాలనీవాసులు పూర్ణ కలశంతో, సన్నాయి మేళంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ అనిరుధ్ రెడ్డి, మున్నా, బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం ఛైర్మన్ సుధాకర్ యాదవ్ దేవస్థానం పాలక మండలి సభ్యులు, అమీనుపూర్ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కె.ఎస్.జి.యువసేన కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. సృజన లక్ష్మీ నగర్ కాలని వాసులు కమ్యూనిటీ భవనం నిర్మించిన కౌన్సిలర్ జి.లావణ్య శశిధర్ రెడ్డికి అమీనుపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.శశిధర్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించిన కాటా శ్రీనివాస్ గౌడ్ దంపతులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కమ్యూనిటీ భవనానికి స్థలం ఇచ్చిన రామిరెడ్డి, శ్రీనివాస్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# వివాద రహితంగా పోచారం అభివృద్ధి





- మున్సిపల్ అభివృద్ధికి సహకరించిన ఈటల, మల్లారెడ్డి
- కృతజ్ఞతలు తెలిపిన పోచారం మున్సిపల్ పాలకవర్గం

**ఘట్కేసర్, జనవరి 27 (నిఘా న్యూస్):** పోచారం మున్సిపాలిటీ అభివృద్ధికీ ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సహకరించి నందుకు సోమవారం వారి నివాసాలకు ఘనంగా సన్మానించారు. అనంతరం పురపాలక సంఘం గుర్తుగా మెమోటోలను బహుకరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎమ్మెల్యే లు మాట్లాడుతూ అన్ని మున్సిపాలిటీల కన్నా పోచారం మున్సిపాలిటీలో ఎలాంటి గొడవలు విభేదాలు లేకుండా ఈ ఐదేళ్ల పాలన చాలా చక్కగా సాగించారని చైర్మన్ ను పాలక వర్గాన్ని అభినందించారు. పురపాలక సంఘం ఏర్పడి ఆరు సంవత్సరాలు అవుతోంది.ఈ ఐదు సంవత్సరాల కాలంలో చైర్మన్ కౌన్సిలర్ల మధ్యం ఎలాంటి విభేదాలు గొడవలు లేవని అందుకే ఆ మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందని వాళ్ళు కొనియాడారు. ఈ ఐదేళ్లు చక్కగా పూర్తిచేసుకుని పరిపాలన చక్కగా సాగించారని వారు అభినందించారు. కొండల్ రెడ్డి చైర్మెన్ పదవికి, రెడ్యా నాయక్ వైస్ చైర్మన్ పదవికి ఇద్దరూ న్యాయం చేశారని వారు కొనియాడారు. అదేవిధంగా 16 మంది కౌన్సిలర్లు కూడా వారి వారి వార్డులలో ఇచ్చిన హామీలను దాదాపు చక్కగా పూర్తిచేసుకుని ఎంతో అభివృద్ధి చేశారని వారిని అభినందించారు. పోచారం మున్సిపాలిటీ రాష్ట్రంలోనే గుర్తింపు స్థాయికి ఎదిగిందని ఎమ్మెల్యే మల్లారెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ పాలక వర్గం సభ్యులు గొంగళ్ల మహేష్ కురుమ, చింతల రాజశేఖర్, బెజ్జంకి హరి ప్రసాద్ రావు, నాయకులు నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, నర్రి కాశయ్య, బద్దం జగన్మోహన్ రెడ్డి, అబ్బావతి నరసింహ, ఆకిటి బాల్ రెడ్డి సుర్వి శ్రీనివాస్, మోటుపల్లి శ్రీనివాస్, అక్రమలి, దాసరి శంకర్, మీసాల రాజేష్, మీసాల కృష్ణ చారి, రాజు యాదవ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి కృషి

### సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్



**తాండూరు, జనవరి 27 (నిఘా న్యూస్):** ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ స్పష్టం చేశారు. తాండూరు పట్టణ కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉండాలనే సదుద్దేశంతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1 గంట 30 నిమిషాల వరకు కొనసాగుతుందని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజావాణిలో మొత్తం 14 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో డివిజన్ పరిధిలోని పది రెవెన్యూ సమస్యల దరఖాస్తులు, మూడు మండల పరిషత్ దరఖాస్తులు, ఒకటి పంచాయతీ రాజ్ దరఖాస్తు స్వీకరించడం జరిగిందని పేర్కొన్నారు. స్వీకరించిన దరఖాస్తులలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగిందని తెలిపారు.

## సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించండి

### జిల్లా అధ్యక్షులు వెంకట్రాంరెడ్డి



**తాండూరు, జనవరి 27 (నిఘా న్యూస్):** 2024వ సంవత్సరం నుండి అమలవుతున్న సి.పి.ఎస్ పద్ధతిని రద్దుచేసి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యు.పి.ఎస్ కాకుండా ఓ పి ఎస్ పద్ధతిని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని పిఆర్టియు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, బషీరాబాద్ మండల పి ఆర్ టి యు అధ్యక్షులు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పిఆర్టియు సంఘం సభ్యులు బషీరాబాద్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి మధ్యాహ్నం సమయంలో చేరుకుని, తహసిల్దార్ వై. వెంకటేష్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వై. వెంకటేష్ మాట్లాడుతూ స్వీకరించిన వినతి పత్రాన్ని, కలెక్టర్ కార్యాలయానికి పంపించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి రవీందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్ గౌడ్, సాజిదా బేగం, బి. నాగరాజు, జిల్లా బాధ్యులు గోవర్ధన్ గౌడ్, సులేమాన్, నాగరాజు, ముస్తఫా, మండల బాధ్యులు భీమప్ప, గాయత్రి, రాఘవేందర్ రెడ్డి, శ్రీనివాస్, మొహిద్, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం కావాలి

### రతన్ టాటా ఉద్యోగపతి అవార్డు గ్రహీత దయానంద్ యాదవ్



**హైదరాబాద్, జనవరి 27 (నిఘా న్యూస్):** ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ముందుకు సాగాలని ప్రముఖ వ్యాపారవేత్త, రతన్ టాటా ఉద్యోగపతి అవార్డు గ్రహీత బండారి దయానంద్ యాదవ్ అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని జాంబాగ్ లోని యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్, శ్రీకృష్ణ ప్రోగ్రెసివ్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ చిట్టబోయిన నందకిషోర్ యాదవ్, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్(టీసీసీ) రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తో కలసి మెడల్స్ బహుమతులు ప్రధానం చేశారు. వేడుకల్లో ముష్కిల కిషన్ యాదవ్, బోహిని వెంకటేష్, సల్ల ఆనంద్ యాదవ్, చౌదరి సలంద్రి నిరంజన్ యాదవ్, పింజర్ల మల్లికార్జున యాదవ్, మంగళారపు మల్లికార్జున్ యాదవ్, నేతుల ఉపేందర్, గొర్ల సాయిరాం, చినంగుల రాజు యాదవ్, ముచ్చర్ల సత్యనారాయణ, చిట్టబోయిన సందీప్, చిన్నబోయిన వెంకటేష్, నీలం దిలీప్ దీపేష్ యాదవ్, సురేష్, జెట్టి నవీన్ పాల్గొన్నారు.



**జిల్లా ప్రోగ్రాం అధికారిణిగా డాక్టర్.వై.పవిత్ర అంకిత భావంతో విధులు నిర్వహిస్తుండడంతో, ఉత్తమ జిల్లా ప్రోగ్రామ్ అధికారిణి గా ఎంపిక కావడంతో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ జిల్లా ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ వై. పవిత్ర కు ఉత్తమ ప్రోగ్రాం అధికారిణి గా ప్రశంస పత్రం అందించారు. దీంతో డాక్టర్ వై. పవిత్ర సంతోషం వ్యక్తం చేస్తూ, తనపై ఇంకా బరువు బాధ్యతలు పెరిగాయని వెల్లడించారు.**

*–వికారాబాద్, జనవరి 27 (నిఘా న్యూస్):*

## పిపిఎల్ 15 ఎడిషన్ విజేత మన్యం రైడర్స్




**పెబ్బేరు, జనవరి 27 (నిఘా న్యూస్):** శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి జాతర సందర్భంగా పిపిఎల్ 15 ఎడిషన్ ఫైనల్లో రిషి రైడర్స్ పై మన్యం రైడర్స్ టీం ఘన విజయం సాధించారు. మొదట బ్యాటింగ్ చేసినటువంటి మన్యం రైడర్స్ 10 ఓట్లు పూర్తిచేసుకుని 6 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేశారు.తదనంతరం 103 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగినటువంటి రిసీ రైడర్ టీం ఐదు వికెట్లు కోల్పోయి 85 పరుగులు చేశారు.ఇట్టి పిపిఎల్ 15 ఎడిషన్ కు మొదటి నగదు బహుమతి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి 50వేల రూపాయలు,రెండో నగదు బహుమతి బి.జగన్నాథం 30వేల రూపాయలు, మూడవ నగదు బహుమతి బుసిరెడ్డి శివప్రసాద్ రెడ్డి 20 వేల రూపాయలను అందించడం జరిగిందని క్రికెట్ టీం సభ్యులు తెలిపారు.

## విద్యార్థులందరికీ అపార్ కార్డు తప్పనిసరి

### ఎంఈఓ పోతు ప్రభాకర్




**ధర్మపురి, జనవరి 27 (నిఘా న్యూస్):** దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఇకపై ఆధార్ తరహాలో అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ - అపార్) గుర్తింపు కార్డు తప్పనిసరి అని ధర్మారం మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ అన్నారు.ధర్మారం మండలం నందిమేడారంలో గల బాలురు మరియు బాలికల గురుకుల పాఠశాలల్లో అపార్ జనరేషన్ కు సంబందించి నమోదుకు ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసి అపార్ ఐ.డి జనరేషన్ లో ఎదురయ్యే సమస్యలను ఎలా ఆదిగమించాలో సూచనలు ఇస్తూ అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు విద్యాసంస్థలు తమ తమ విద్యార్థులకు అపార్ ఐ.డి లను త్వరిత గతిన జనరేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని పిలుపునిచ్చారు.'వన్ నేషన్- వన్ ఐడీ' పేరుతో పన్నెండు అంకెలుండే ఈ కార్డులు ప్రతీ విద్యార్థికి అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా గురుకులాల ప్రిన్సిపల్స్ యుగేంద్ర లక్ష్మి,విద్యాసాగర్, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ కుమార స్వామి బోధన, భోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత



**ధర్మపురి, జనవరి 27 (నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండలం పెరుకపల్లి గ్రామానికి చెందిన పిట్టల సత్యం ఫోర్ టేబుల్స్ స్పీకర (సౌండ్ బాక్స్)ను, కాలువ రాజు విద్యార్థులు కూర్చోవడానికి రెండు కార్పెట్లను పాఠశాలకు ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పిట్టల సత్యం,కాలువ రాజులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్,ఉప సర్పంచ్ తిరుపతి, గ్రామ కార్యదర్శి సంతోష్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామంలోని యువకులు పాల్గొన్నారు.


## దేవాలయ అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలి



**బాలాపూర్, జనవరి 27 (నిఘా న్యూస్):** దాతలు ముందుకు వచ్చి దేవాలయం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కర్మన్ ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయం ఈఓ ఎన్ లావణ్య అన్నారు. సోమవారం దాతల సహాయంతో ఆలయ ప్రాంగణంలోని నవగ్రహ మంటపం నుండి దుర్గామాత ఆలయం వరకు భక్తుల సౌకర్యార్థం నిర్మించిన టిన్ షెడ్డును దాతలతో కలిసి ప్రారంభించారు. షెడ్డు నిర్మాణదాతలు రాజులపాటి శ్రీనివాస్, దంటపల్లి వెంకటరెడ్డి, ఉష, గుజ్జ వాణి జైవీర్ రెడ్డి, బొల్లంపల్లి విశాల మనోహర్, పానెం కృష్ణవేణి శ్రీనివాస్ గౌడ్, బబ్బూరి శ్రీలత ఆనంద్ కుమార్ గౌడ్, గోపు నివేదిత కృష్ణ ప్రదీప్ లచే ప్రారంభోత్సవ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ధర్మకర్తలు, ఆలయ అర్చకులు, వేద పండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చీకటి రోజులను తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

### చనుపల్లి బిఆర్ఎస్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**అనంతగిరి, జనవరి 27 (నిఘా న్యూస్):** మండల పరిధిలోని చనుపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాడం ఖాయం అని కోదాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసన సభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా అని అన్నారు.స్థానిక ఎన్నికలలో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం అయిందని తెలిపారు. సంవత్సరం కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి వచ్చిందని ఆయన అన్నారు. బడికి పోయే పిల్లల నుండి పింఛన్లు అందుకునే అవ్వా తాతల దాకా రోడ్లు ఎక్కారంటే ఆ ఘనత రేవంత్ రెడ్డిదే అని తెలిపారు.కేసీఆర్ బతుకమ్మ పండుగ వేల చీరెలు ఇచ్చిండు. కేసీఆర్ కిట్లు, న్యూట్రీషన్ కిట్లు ఇచ్చిండు, చెరువుల్లో చేపలు వేసిండు. గొర్రెలు ఇచ్చిండు కేసీఆర్ ప్రభుత్వం పోయాక అన్నీ పోయాయని అన్నారు. నేడు 10వేలు, రేపయితే 15వేల రైతు భరోసా అన్నరు. మహిళలకు 2500 అన్నడు. ప్రతి మహిళకు 25వేల బాకీ పడ్డడు అని తెలిపారు.బతుకమ్మ చీరెలు అన్నడు, 500 ఇస్తడు అన్నడు ఎగ్గొట్టిండని అన్నారు. వృద్ధులకు 4వేల పింఛన్ ఇస్తా అని మాట తప్పిండు ఇచ్చే రెండు వేల పింఛన్ కూడా రెండు నెలలు ఎగ్గొట్టిండు అని గుర్తు చేశారు. పింఛన్లు దగా రైతులకు బోనస్ దగా,రుణమాఫీ దగా, తులం బంగారం దగా,విద్యార్థులకు జాబ్స్ దగా,మహిళలకు 2500 దగా, అన్నీ దగా ఎనుముల రేవంత్ రెడ్డి కాదు, ఎగవేతల రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు, చీటింగ్ మ్యాన్ అన్ని పంటలకు బోనస్ అని మోసం చేసిండు అని ఆయన తెలిపారు.ఓట్ల ముందు డిసెంబర్ 9 తారీఖు రుణమాఫీ అన్నడు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆగస్టు 15నాటికి పూర్తి చేస్తా అన్నడు అని గుర్తు చేశారు. దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నల్ల భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులోత్ శ్రీనివాస్ నాయక్, మాజీ సొసైటీ చైర్మన్ ఉషారాణి హనుమంతరావు, పార్టీ నాయకులు మట్టపల్లి పుల్లయ్య గౌడ్, పూర్ణచందర్, అఫ్జల్, బిక్షం, మట్టపల్లి సైదులు, అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు, మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు, సింగల్ విండర్ డైరెక్టర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం



**వలిగొండ, జనవరి 27 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామం లో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సహకారంతో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం మరియు దూడల ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఈవో డాక్టర్ రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది. పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేయడం జరిగింది. ఈ శిభిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, వ్యాధి బారిన పడకుండా సకాలంలో టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యధికారి డాక్టర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగింది. ఎదలో ఉన్న వాటికి కృత్రిమ గర్భధారణ చేశారు. అదేవిధంగా చూడి పరీక్షలు చేయడం జరిగింది. దూడలకు నట్టల నివారణ మందులు వేయడం జరిగింది. రైతులకు కృత్రిమ గర్భధారణ, మేలు జాతి పాడి పశువుల పై అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా విటమిన్ ఇంజక్షన్లు ఇవ్వడం జరిగింది, పాల దిగుబడిని పెంచే ఖనిజ లవణ మిశ్రమాలను పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ మహేష్, జేవివో రేఖ, మల్లేశం, ఉపేందర్, వెంకటరమణ గోపాల మిత్రులు శ్రీశైలం, మల్లేశం, స్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణకు గ్రామస్తులు సహకరించాలి


### ఈ ఓ ఆర్ డి, ఎంఎస్ఎన్ రెడ్డి



**పెదపూడి, జనవరి 27 (నిఘా న్యూస్):** కాకినాడ జిల్లా వనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం పెద్దాడ గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ డోకూబుర్ర మీనాక్షి అధ్యక్షతన గ్రామాభివృద్ధి ప్రణాళికల గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈవోపీఆర్డి ఎం.ఎస్ఎ.న్ రెడ్డి, గ్రామ పెద్దలు వీరభద్రం, కాశి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డి ఎం ఎస్ ఎన్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఏడాదికి పంచాయతీ చేపట్టే పనుల ప్రణాళికలకు ప్రజా భాగస్వామ్యంతో వచ్చే ఆదాయం ఎన్ఆర్ఈజీఎస్ తదితర గ్రాంట్లు మ్యాచింగ్ లు మొత్తం జమలు అలాగే ఆవబోయే ఖర్చులు చదివి వినిపించడం జరిగిందని ప్రజల ఆమోదంతో జిపిడిపి గ్రామ సభ నిర్వహించా మన్నారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజల సహకారం వుండాలని చెత్తనుండి సంపద కేంద్రాలను పూర్తిగా నిర్వహించాలి అంటే గ్రామంలో మహిళలు తడి చెత్త పొడి చెత్త వేరు వేరుగ విడదీసి పంచాయతీ వారు ఇస్తున్న బుట్టలలో వేయాలని కోరారు. దాని ద్వారా వర్మీ కంపోస్ట్ తయారీ ప్లాస్టిక్ రీసైక్లింగ్, అమ్మకం ద్వారా గ్రామపంచాయతీ కి ఆదాయం వస్తోందాన్ని చెత్త సమస్యకు పూర్తి పరిస్కారం లభిస్తోందని ఆయన అన్నారు సభ అనంతరం డస్ట్ బీన్స్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్ గా పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీను నిర్వహించారు.

# దళితుల భూములకు రక్షణ కరువు

- ఎండ్లు గడుస్తున్నా కబ్జాదారుల పై చర్యల కరువు
- జిల్లా కలెక్టర్ కు దళిత సంఘాల వినతి



**హనుమకొండ, జనవరి 27 (నిఘా న్యూస్):** హనుమకొండ జిల్లా దామెర మండలం ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన దళిత రైతు చిలువేరు బిక్షపతికి చెందిన సర్వే నెంబర్ 255/1 లో రెండు ఎకరాల నాలుగు గుంటల భూమి స్వర్గీయ ఇందిరాగాంధీ ఆయాంలో భూ పంపిణి జరిగింది. అందులో కెల్లి 22 గుంటల భూమిని తన ధన బలంతో ఆర్ డబ్ల్యూఎస్ శాఖలో పనిచేస్తున పిల్లల మర్రి సతీష్ కుమార్ అతని సతీమణి పుష్పలత పేరుతో దళితుని భూమిని కబ్జా చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఏండ్లు గడుస్తున్న భూ భకాసురునిపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ, పోలీస్ ఆధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, పలుమార్లు జిల్లా కలెక్టర్, సంబంధిత రెవెన్యూ అధికారులకు, పోలీస్ యాత్రంగానికి సమస్యపై విన్నవించిన బాధిత దళిత రైతుకు న్యాయం దోరకక, కబ్జాదారునిపై చర్యలు లేక దళితుల భూములకు రక్షణ లేకుండా పోతుందని జాతీయ మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షులు మన్నే బాబూరావు, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమీటీ సభ్యులు చుంచు రాజేందర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అంకేశ్వరపు రాంచందర్ రావు,డివియంసి సభ్యులు సింగారపు రవి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కు బాధిత కుటుంబంతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను అప్పనంగా కబ్జా చేస్తూ,పట్టాదారు పాస్ పుస్తకాలను పొందిన వారి వివరాలను కలెక్టర్ కు అందజేశారు. దళితుడైన చిలువేరు బిక్షపతి భూమి సమస్యను త్వరగా పరిష్కరించి కుటుంబానికి సత్వర న్యాయం చేకూర్చాలన్నారు. దళితుల భూముల పరిష్కారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి భూ బాధితులకు తోడుగా ఉండాలన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు



**వలిగొండ, జనవరి 27 (నిఘా న్యూస్):** వలిగొండ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల 20వ మహాసభలు వలిగొండ ప్రగతి కళాశాలలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు పాల్గొని మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న 8,300 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి, స్కాలర్షిప్ విడుదల కాక చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు. అదేవిధంగా వలిగొండ మండల పేరుతో బీబీనగర్లో కొనసాగుతున్న ఎస్సి బాలికల గురుకులంలోని వలిగొండకు మార్చి సొంత భవనం నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వలిగొండ మండలంలోని జూనియర్ కళాశాల వద్ద పెండింగ్లో ఉన్న రిక్వెస్ట్ బస్టాండ్ ను పూర్తిస్థాయిలో నిర్మాణం చేయాలని అన్నారు. ప్రజాపాలన పేరుతో అధికారం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం కడుతున్న గాని విద్యారంగంలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని తక్షణమే రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రభుత్వ విద్యారంగానే బలోపేతం కోసం కృషి చేయాలని ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని లేకపోతే మండలంలో మండల వ్యాప్తంగా విద్యార్థులను కదిలించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు మైసొల్ల నరేందర్ వేముల జ్యోతిబాసు బుగ్గ ఉదయ్ ఎండి ఫర్దిన్ వేములకొండ వంశీ సాయి వినయ్ ప్రణీత్ రుచిక తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు




**వరంగల్, జనవరి 27 (నిఘా న్యూస్):** 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదకు వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ పక్షాన జిల్లా అధ్యక్షులు గజ్జెల రామ్ కిషన్ ఆధ్వర్యంలో సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పంచాయతీ సెక్రటరీల సేవలను గుర్తించి, వారికి ప్రాధాన్యత ఇస్తూ అధిక సంఖ్యలో జిల్లా ఉత్తమ ఉద్యోగి అవార్డులు ఇచ్చినందుకుగాను వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ పక్షాన జిల్లా అధ్యక్షులు గజ్జెల రామ్ కిషన్ జిల్లా కలెక్టర్ సత్య శారదకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్ష కార్యదర్శులు యాకూబ్ నాయక్, దయ్యాల సదానందం, నాయకులు రఘు, అశోక్, కక్కెర్ల సదానందం, రజిత, స్రవంతి, మెడికల్ ఫోరం జిల్లా అధ్యక్షులు మాడిశెట్టి శ్రీనివాస్, జిల్లా నాయకులు యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత



**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి 27 (నిఘా న్యూస్):** అబ్దులాపూర్ మెట్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 76వ గనతంత్ర దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు తాగునిటీ కోసం తన సొంత డబ్బుతో రూ. లక్ష ఐదు వేలు రూపాయలతో గంటకు 250 లీటర్లు ఉత్పత్తి చేసే వాటర్ ఫిల్టర్ ని ఏర్పాటు చేసిన అబ్దుల్లాపూర్ మెట్ మాజీ వార్డ్ సభ్యులు మొగుళ్ళ జీవన్ కుమార్ రెడ్డి ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే.రమేష్, భాస్కర్, ప్రవీణ్, సురేఖ, గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, గ్రామ పెద్దలు బోడిగే అశోక్ గౌడ్, సిహెచ్.శివశంకర్, భాస్కర్, సురేందర్, ధనరాజ్, వేణు,రాజు, కొండల్, హరీష్, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## హిందూ దేవుళ్లను దూషించిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు



**మద్దూర్, జనవరి 27 (నిఘా న్యూస్):** మద్దూరు మండల కేంద్రంలో గణతంత్ర దినోత్సవం రోజు హిందూ దేవుళ్లను దూషించిన వ్యక్తుల పై చర్య తీసుకోవాలని పాత బస్టాండ్ చౌరస్తాలో హిందూ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించి సోమవారం రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా జిల్లా బిజెపి నాయకులు మదన్ మాట్లాడుతూ 76 వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా బాలికల ఉన్నత పాఠశాల యందు జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం అంబేద్కర్ చిత్రపటం లేదని కారణంతో మద్దూరు పట్టణానికి చెందిన కొందరు యువకులు ప్రధానోపాధ్యాయుడు తో గొడవకు దిగడంతో అంబేద్కర్ చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఇదే తరుణంలో అక్కడే ఉన్న భారతదేశ తొలి ప్రధాని నెహ్రూ సరస్వతి దేవి చిత్రపటాలు ఎందుకు పెట్టారని అనే విషయంలోఉపాధ్యాయులతో అసభ్యకర పదజాలంతో దూషించారని అన్నారు.భారతదేశ మొదటి ప్రధాని నెహ్రూను అలాగే లక్ష్మీదేవిని ఆ యువకులు దూషించడం వల్ల హిందూ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించి అట్టి వారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని మద్దూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘ నాయకులు,బిజెపి నాయకులు, ఏబీవీపీ నాయకులు,శివ స్వాములు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా జమాల్ ఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడలు


**చింతూరు, జనవరి 27 (నిఘా న్యూస్):** తెలుగువారి ప్రియమైన పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ సారథ్యంలో 40 రోజుల పాటు జరిగిన అంతర్రాష్ట్ర క్రికెట్, వాలీబాల్ పోటీలు ఆర్చరీ, ఫుట్బాల్, ముగ్గుల పోటీలను నిర్వహించడం జరిగింది. క్రీడల్లో విజేతలైన వారికి గణ తంత్ర దినోత్సవ సందర్భంగా క్రీడాకారులకు కళాకారులకు ప్రోత్సాహకాలను అందజేయడం జరిగింది. జమాల్ ఖాన్ స్థానిక అధికారులు ప్రజా ప్రతినిధులు తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కళ వేదికపై పాల్వంచకు చెందిన ఎస్కే హుస్సేన్ చింతూరు చల్లని పల్లె తల్లి అని పాటను ఆలపించారు. ములుగు జిల్లాకు చెందిన మార్తా రవి పలు చలన చిత్రాల్లోను ఈటీవీ జబర్దస్త్ అంతర్జాతీయ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖ ఇంద్ర జాలికుడు అద్భుత ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. మండలంలోని పలు విద్యాసంస్థలకు చెందిన బాల బాలికలు చిన్నారుల ఫ్యాషన్ షో తో పాటు స్వతంత్ర సమరయోధుల వేషధారణలు, నేటి సమాజంలో సెల్ఫోన్ వాడకంపై యువత సామాజిక స్పృహను కోల్పోవడం సెల్ఫీలతోనే సరిపెట్టుకోవడం విద్యార్థులు సెల్ఫోన్ వినియోగం దుష్ప్రభావ సందేశాన్ని అందజేసే విధంగా చేసిన ప్రదర్శన స్ఫూర్తి దాయకంగా నిలిచింది. మూడువేలకు పైగా ఈ కార్యక్రమానికి ప్రేక్షకులు హాజరై విజయవంతంగా కార్యక్రమం కొనసాగింది. జమాఖాన్ ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ ఏజెన్సీ నాలుగు మండలాలో నే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఒరిస్సా ఛత్తీస్గఢ్ లో కూడా ట్రస్ట్ ద్వారా






అనేకమంది వరద బాధితులకు, అగ్ని బాధితులకు, వికలాంగులకు, అనాథలకు ట్రస్ట్ ద్వారా లక్షలాది రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. 2022 నుండి 23 సంవత్సరకాలంలో 31 లక్షల వ్యయంతో బాధితులకు వస్తు నగదు రూపేనా సహాయం అందజేయడం జరిగిందన్నారు. ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన వారికి సొంత ఖర్చులతో జైపూర్ కాళ్లను ఏర్పాటు చేశారు. ఇలా అనేక సహాయ కార్యక్రమాలపై జమాల్ ఖాన్ ట్రస్ట్ ను వారి సేవలను కొని ఆడారు. అనంతరం లక్కీ డ్రా ద్వారా పలువురికి విలువైన వస్తు వులు వేదికపై అందజేశారు. అనంతరం గోల్డ్ మెడల్ గ్రహీత మధు చందన వెయిట్ లిఫ్టర్ కు గంగాధర్ కు స్థానిక యువత జెకె సిటీ సన్మానం నిర్వహించారు. జమాల్ ఖాన్ ను సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్, తనయుడు ఇమ్రాన్ ఖాన్, అబ్రార్ ఖాన్, అటవీ శాఖ అధికారి తిమ్మ సాయి, సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్, బిజెపి మండలాధ్యక్షులు దాసరి వెంకటరమణ, వైస్ ఎంపీపీ సుధాకర్ చిన్ని, టిడిపి నాయకులు పి సాల్మన్ రాజు, ముత్యాల శ్రీరామ్, పొదిలి రామారావు, నరసింహారావు, సురేష్ చౌదరి, జనసేన మండలాధ్యక్షులు మడివి రాజు, కూనవరం మండలాధ్యక్షుడు చందు, రసూల్, విఆర్ పురం మండల మహిళా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు ఎస్ కె రియాజ్, జీవన్ కుమార్, వ్యాఖ్యాతగా మన్యం కవి నూనె రమేష్,ఎస్కే షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు వేతనాలు ఇప్పించిన రవి సింగ్



**కూకట్ పల్లి, జనవరి 27 (నిఘా న్యూస్):** కూకట్ పల్లి ఇండస్ట్రీ పరిధిలోని గ్లాడియేటర్ ప్రైవేట్ లిమిటెడ్ సెక్యూరిటీ కాంటాక్ట్ ఆఫీస్ హౌసింగ్ బోర్డ్, లులు మాల్ లో సెక్యూరిటీ గార్డ్ గా గత కొన్ని సంవత్సరాల నుంచి పని చేస్తున్నా, అబ్బాస్ సెక్యూరిటీ కార్మికుడు అబ్బాస్ అనివార్య కారణాలవల్ల డ్యూటీ మానేయడం జరిగింది. సెక్యూరిటీ గార్డ్ అబ్బాస్ కు రావలసిన గత సంవత్సరం నవంబర్ నెల వేత్తనం ఇవ్వాల్సి ఉండగా గ్లాడియేటర్ ప్రైవేట్ లిమిటెడ్ సెక్యూరిటీ కాంటాక్ట్, వేత్తనం ఇవ్వకుండా దుర్భాషలాడి సెక్యూరిటీ గార్డ్ ను బెదిరించి పంపించేవాడు సెక్యూరిటీ కార్మికునికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి సెక్యూరిటీ మిత్రులు ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ కార్యాలయం వద్దకు వెళ్లి సెక్యూరిటీ గార్డ్ కి జరిగిన అన్యాయం గురించి చెప్పారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్ హుటాహుటిన గ్లాడియేటర్ ప్రైవేట్ లిమిటెడ్ సెక్యూరిటీ మేనేజ్ మెంట్ దగ్గరికి వెళ్లి సెక్యూరిటీ కార్మికుడికి గత సంవత్సరం నవంబర్ నెల వేత్తనం రావాల్సి ఉండగా వెంటనే మాట్లాడి, సెక్యూరిటీ గార్డ్ అబ్బాస్ కు రావాల్సిన వేత్తనం ఇప్పించడం జరిగింది. సెక్యూరిటీ గార్డ్ అబ్బాస్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవిసింగ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘట్ కేసర్ మున్సిపల్ సభ్యులకు సన్మానం

### మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**ఘట్ కేసర్, జనవరి 27 (నిఘా న్యూస్):** అయిదు సంవత్సరాలుగా అవిశ్రాంత కృషి చేసి పట్టణ ప్రగతికి పాటుబడిన మున్సిపల్ పాలకవర్గ సభ్యుల పదవి కాలం ముగియటంతో మున్సిపల్ చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్, కౌన్సిలర్ల సేవలను కొనియాడుతూ సోమవారం ఆత్మీయ విడ్కోలు పలికారు. ఘట్కేసర్ పట్టణంలోని నారాయణ గార్డెన్ లో జరిగిన ఆత్మీయ విడ్కోలు సమావేశంలో చైర్మన్ పావని యాదవ్, వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి, అయా వార్డుల కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించి వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మల్కాజిగి ఎంపీ ఈటల రాజేందర్, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, హరివర్ధన్ రెడ్డి, మహేష్ గౌడ్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ పదవి



లేకున్నా ప్రజా సంక్షేమం కోసం పని చేసినప్పుడే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని చెప్పారు. పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దిన పాలకవర్గానికి అభినందనలు తెలుపుతున్నట్లు చెప్పారు. చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ ఘట్ కేసర్ పట్టణ అభివృద్ధికి అవిశ్రాంత కృషి చేసి జిల్లాకే ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. సమస్యలు లేని మున్సిపాలిటీగా మార్పు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. విలీన గ్రామాలలో నెలకొన్న సమస్యలను సైతం పరిష్కరించినట్లు పేర్కొన్నారు. పచ్చదనం, పరిశుభ్రత కోసం నిరంరతం పని చేసి రెండు సార్లు జాతీయ అవార్డులు అందుకోవటం గర్వంగా ఉందన్నారు. పదవి లేకున్నా ప్రజా సేవే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. కమీషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్ రెడ్డి, కొమ్మగోని రమాదేవి మహిపాల్ గౌడ్, బొక్క సంగీత ప్రభాకర్ రెడ్డి, బండారి అంజనేయులు గౌడ్, కొమ్మిడి అనురాధ రాఘవరెడ్డి, జహంగీర్, బేతాళ నర్సింగ్ రావు, సల్లూరి నాగజ్యోతి నర్సింగ్ రావు, కడపొల్ల మల్లేష్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

# వెలుగు వివోఏల వేతన బకాయిలు చెల్లించాలి



### మూడు సంవత్సరాల కాల పరిమితి సర్కులర్‌ను రద్దు చేయాలి: సీఐటీయు

**చింతూరు, జనవరి 27 (నిఘా న్యూస్):** ఏపీ వెలుగు వివో ఏల యానిమేటర్స్ ఉద్యోగాల సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు భాగంగా చింతూరు డివిజన్ పరిధిలో విఆర్ పురం కూనవరం చింతూరు ఎటపాక వివో సమస్యలు పరిష్కరించాలని. బకాయి వేతనాలు చెల్లించాలని. ఈనెల 27. 28 తేదీలలో చింతూరు ఐటీడీఏ ముందు సిఐటియూ ఆధ్వర్యంలో సామూహిక దీక్షను సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలల నుండి బకాయి వేతనాలు చెల్లించాలని, వివోఏ ల ఉపాధిని దెబ్బతీసే మూడు సంవత్సరాల కాల పరిమితి సర్కులర్ ల ను రద్దు చేయాలని. రాష్ట్రవ్యాప్తంగా 28 వేల మంది వివోఏలు పొదుపు సంఘం మహిళలకు దీర్ఘకాలంగా సేవలందిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం మూడు సంవత్సరాల పని చేసిన వివో ఏ లను తొలగించి వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలని 2019 నవంబర్ నెలలో సర్కులర్ను జారీ చేశారు. నాటి నుండి నేటి వరకు కాలపరమితి సర్కులను రద్దు కోసం ఉద్యోగ భద్రత కోసం హెచ్ ఆర్ పాలసీ అమలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం. కల్పించాలని, జండర్ పేరుతో తొలగింపులు ఆపాలని అన్నారు. కూటమి ప్రభుత్వం విఓఎల కాల పరిమితి సర్కులర్ ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. సర్కులను రద్దుచేసి వివోఎల ఉపాధిని కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు పిఎన్ఎం మండల నాయకులు పట్రా రమేష్. వివోఏ లా నాలుగు మండల నాయకులు గొర్రె లక్ష్మయ్య రత్తయ్య దూలమ్మ రత్నకుమారి లీలావతి దుర్గాదేవి అనసూయ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

### మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



**శేరిలింగంపల్లి, జనవరి 27 (నిఘా న్యూస్):** క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని మియాపూర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్ఎంఆర్ హైలాండ్ అపార్ట్మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 76వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎంఆర్ హైలాండ్ అపార్ట్మెంట్స్ అసోసియేషన్లో ఇలాంటి క్రీడలను నిర్వహించడమే గాకుండా పోటీలలో పాల్గొన్న వారిని ప్రోత్సహించి బహుమతులను అందజేయడం మంచి పరిణామం అని కార్పొరేటర్ శ్రీకాంత్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఆర్ అసోసియేషన్ అధ్యక్షులు సామ నర్సిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్ రావు, పిచ్చయ్య, మల్లారెడ్డి,నవీన్, కళ్యాణ్, వేదశ్రీ, సుగుణ, శోభ, బాలరాజు, జయతిర్థ, హరికిషోర్, వాణి, భాస్కర్ రెడ్డి, కొణిదేనా కృష్ణ రావు, విశ్వనాథం, పద్మ విశ్వనాథ్ పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు




**వలిగొండ, జనవరి 27 (నిఘా న్యూస్):** వలిగొండ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల 20వ మహాసభలు వలిగొండ ప్రగతి కళాశాలలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు పాల్గొని మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న 8,300 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి, స్కాలర్షిప్ విడుదల కాక చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు. అదేవిధంగా వలిగొండ మండల పేరుతో బీబీనగర్లో కొనసాగుతున్న ఎస్సి బాలికల గురుకులంలోని వలిగొండకు మార్చి సొంత భవనం నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వలిగొండ మండలంలోని జూనియర్ కళాశాల వద్ద పెండింగ్లో ఉన్న రిక్వెస్ట్ బస్టాండ్ ను పూర్తిస్థాయిలో నిర్మాణం చేయాలని అన్నారు. ప్రజాపాలన పేరుతో అధికారం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం కదుతున్న గాని విద్యారంగంలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని తక్షణమే రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రభుత్వ విద్యారంగానే బలోపేతం కోసం కృషి చేయాలని ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని లేకపోతే మండలంలో మండల వ్యాప్తంగా విద్యార్థులను కదిలించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు మైసొల్ల నరేందర్ వేముల జ్యోతిబాసు బుగ్గ ఉదయ్ ఎండి ఫర్దిన్ వేములకొండ వంశీ సాయి వినయ్ ప్రణీత్ రుచిక తదితరులు పాల్గొన్నారు.

# పెదపూడి మండల సర్వసభ్య సమావేశం




**పెదపూడి, జనవరి 27 (నిఘా న్యూస్):** కాకినాడ జిల్లా పెదపూడి మండలం పెదపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కేత తులసి శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సీతాపతి, ఎంపీడీవో నరేందర్ రెడ్డి, అధికారులు ప్రభుత్వం తరపున హుందాగా వివరణ ఇవ్వగా ప్రతిపక్ష హోదాలో పాలక సభ్యులు చక్కటి పాత్ర పోషించారు. చింతపల్లి పైన ఎంపీటీసీ సుధాకర్ వ్యవసాయ రైతులకు సంబంధించి కొన్ని సమస్యలు లేవనెత్తగా వ్యవసాయ శాఖ అధికారులు వాటికి సంబంధించి చర్యలు తీసుకోవడం జరిగిందని వివరణ ఇచ్చారు అదేవిధంగా సంపర ఉన్నత పాఠశాలలో సైకిల్ స్టాండ్ గురించి లేవనెత్తగా విద్యాశాఖ స్టాండ్ కావాలని కోరుతూ వినతిపత్రం సమర్పించమని వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తామని తెలియజేశారు. అనంతరం ఆరోగ్య శాఖకు సంబంధించి ఎంపీటీసీ వెంకటేశ్వర్లు షుగర్ ఇన్సులిన్ ప్రైమరీ హెల్త్ క్లినిక్ లో దొరకడం లేదని సమస్యను లేవనెత్తగా దానికి వైద్యశాఖ అధికారులు మెయిన్ హెల్త్



క్లినిక్ లో లభిస్తుందని వివరణ ఇచ్చారు. కైకవోలు పంట కాలువ పూడికలు తీయించమని కోరగా నిధులకు ఎస్టిమేషన్ పంపించడం జరిగిందని నిధులు మంజూరు కాగానే పెదపూడి మండలంలోని పంట కాలువలు అన్ని మరమ్మతులు చేయడం జరుగుతుందని నీటిపారుదల శాఖ వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెదపూడి మండలం ఎంపిటిసిలు సర్పంచులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘట్ కేసర్ మున్సిపల్ సభ్యులకు సన్మానం

### మల్కాజిగి ఎంపీ ఈటల రాజేందర్



**ఘట్ కేసర్, జనవరి 27 (నిఘా న్యూస్):** అయిదు సంవత్సరాలుగా అవిశ్రాంత కృషి చేసి పట్టణ ప్రగతికి పాటుబడిన మున్సిపల్ పాలకవర్గ సభ్యుల పదవి కాలం ముగియటంతో మున్సిపల్ చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్, కౌన్సిలర్ల సేవలను కొనియాడుతూ సోమవారం ఆత్మీయ విడ్కోలు పలికారు. ఘట్కేసర్ పట్టణంలోని నారాయణ గార్డెన్ లో జరిగిన ఆత్మీయ విడ్కోలు సమావేశంలో చైర్మన్ పావని యాదవ్, వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి, అయా వార్డుల కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించి వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మల్కాజిగి ఎంపీ ఈటల రాజేందర్, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, హరివర్ధన్ రెడ్డి, మహేష్ గౌడ్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ పదవి లేకున్నా ప్రజా సంక్షేమం కోసం పని చేసినప్పుడే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని చెప్పారు. పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దిన పాలకవర్గానికి అభినందనలు తెలుపుతున్నట్లు చెప్పారు. చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ ఘట్ కేసర్ పట్టణ అభివృద్ధికి అవిశ్రాంత కృషి చేసి జిల్లాకే ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. సమస్యలు లేని మున్సిపాలిటీగా మార్పు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. విలీన గ్రామాలలో నెలకొన్న సమస్యలను సైతం పరిష్కరించినట్లు పేర్కొన్నారు. పచ్చదనం, పరిశుభ్రత కోసం నిరంరతం పని చేసి రెండు సార్లు జాతీయ అవార్డులు అందుకోవటం గర్వంగా ఉందన్నారు. పదవి లేకున్నా ప్రజా సేవే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. కమీషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్ రెడ్డి, కొమ్మగోని రమాదేవి మహిపాల్ గౌడ్, బొక్క సంగీత ప్రభాకర్ రెడ్డి, బండారి అంజనేయులు గౌడ్, కొమ్మిడి అనురాధ రాఘవరెడ్డి, జహంగీర్, బేతాళ నర్సింగ్ రావు, సల్లూరి నాగజ్యోతి నర్సింగ్ రావు, కడపొల్ల మల్లేష్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాల సమర్పణ



**కడప, జనవరి 27 (నిఘా న్యూస్):** సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు నగరంలోని విద్యుత్ భవన్ వద్ద సోమవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పిలుపుమేరకు అన్ని జిల్లాలలో విద్యుత్ ఎస్సీకి వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపు ఇవ్వడం అయింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియుజిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్కో డిస్కం జెన్కోలో పనిచేస్తున్నటువంటి 23,500 మంది విద్యుత్ కార్మికులకు 2022 పిఆర్సి అరియర్స్ ఇంతవరకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ఉన్నారు. ఈ ప్రభుత్వమైనా గత ప్రభుత్వం చేసిన ఒప్పందాన్ని అమలు చేయాలని కార్మికులు కోరుకున్నారు. అలాగే కొత్త ఆపరేటర్లందరికి 2019 నుండి 2024 వరకు చేరిన ప్రతి ఒక్కరికి పాత ఆపరేటర్ తో సమానంగా జీతాలు ఇవ్వాలి ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఉన్న ఐటిఐ విద్యార్హత ఉన్న వాచ్మెన్ అందరికీ స్కిల్ చేసి స్కిల్ వేతనం వేతనం అమలు చేయాలని ప్రతి సబ్ స్టేషన్ లో నైట్ వాచ్మెన్ నియమించాలని నైట్ వాచ్మెన్ నియమించకపోతే కార్మికునికి ఏదైనా జరిగినా ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందని అలాగే డిపార్ట్మెంట్ ఎక్విప్మెంట్ డ్యామేజ్ అయితే కోట్ల రూపాయలు నష్టం జరుగుతుందని ప్రభుత్వం దీన్ని గమనించి ఉన్నతాధికారులు దీని పరిగణలోకి తీసుకొని వెంటనే నైట్ వాచ్ మీద నియమించాలని కోరుతున్నాము. పి సుదర్శన్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ గా ఉన్న వాచ్మెన్ అందరికీ స్కిల్ చేసి స్కిల్ వేతనం, యిడ్ హాలిడేస్ ఇవ్వాలి.ప్రతి సబ్ స్టేషన్ లో నైట్ వాచ్మెన్ ఖచ్చితంగా నియమించాలి. అనంతరంవినతి పత్రం డి ఈ టెక్నికల్ మధుసూదన్ కి యునైటెడ్ ఎలక్ట్రి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అందజేయడం జరిగింది.ఈ వినతి పత్రిక కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సంగంజిల్లా అధ్యక్షులు కే.శ్రీనివాసులు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిస్కం అధ్యక్షులు ఎన్ శివశంకర్ నాయకులు రవీంద్రారెడ్డి, గిరి వెంకట్ సాంబశివరెడ్డి, నాగరాజు, నాగార్జున, బ్రహ్మం, ప్రవీణ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



**శ్రీకాళహస్తి, జనవరి 27 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నందు మహాశివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సోమవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలోని పలుచోట్ల పరిశీలన చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆలయ సుందరీకరణ, లైటింగ్స్ ఫ్లవర్ డెకరేషన్ క్యూలైన్స్ లో భక్తులకు సౌకర్యాల కోసం పరిశీలించి దేవస్థానం ఇంజనీరింగ్ శాఖ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ చెంచయ్య నాయుడు దుర్గాప్రసాద్ వినయ్ ప్రవీణ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## పదవీకాలం ముగిసిన ప్రశ్నిస్తూనే ఉంటాను

### ఇల్లందు మున్సిపల్ కౌన్సిలర్ సామల మాధవి




**ఇల్లందు, జనవరి 27 (నిఘా న్యూస్):** ఐదు సంవత్సరాల కౌన్సిలర్ పదవి కాలం ముగిసిన సందర్భంగా ఏడో వార్డ్ కౌన్సిలర్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో ఏడో వార్డ్ కౌన్సిలర్ గా అవకాశం ఇచ్చిన అప్పటి ఎమ్మెల్యే కు రుణపడి ఉంటానని అన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను వార్డు ప్రజలకు అందించటంలో బాధ్యత రహితంగా వ్యవహరించానన్నారు. 2022 సంవత్సరంలో పట్టాలు రేషన్ కార్డులు పింఛన్లు కళ్యాణ లక్ష్మి.షాదీ ముబారక్ చెక్కులు వార్డు ప్రజలకు అందించడం జరిగిందన్నారు. వార్డు అభివృద్ధికి సహకరించకుండా పక్షపాతంగా వ్యవహరిస్తూ వార్డుపై కక్ష కట్టిన పాలకవర్గ తీరును ఎదిరిస్తూ సొంత డబ్బులతో వీధిలైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కరోనా టైంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందించి అండగా నిలిచామన్నారు,పదవి ఉన్నా లేకున్నా ప్రజలతో ఉంటూ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటానన్నారు. ఆనాడు నాపై నమ్మకం ఉంచి నా గెలుపు కోసం కష్టించిన బిఆర్ఎస్ నాయకులకు గెలిపించిన వార్డ్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు,

## మల్లాపూర్ కురుమ సంఘం అధ్యక్షునిగా చిగుళ్ల శ్రీనివాస్



**మల్లాపూర్, జనవరి 27 (నిఘా న్యూస్):** మల్లాపూర్ కురుమసంఘం అధ్యక్షునిగా చిగుళ్ల శ్రీనివాస్ ఎన్నికైనారు. ఎలిఫెంట్ సర్కిల్ సమీ పంలోని బీరప్ప దేవాలయ వద్ద జరిగిన మల్లాపూర్ కురుమసంఘ సమావేశం లో శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక కమిటీ సభ్యులుగా సూర్ణం రాజేష్, బెల్లం గట్టయ్య, బక్కయ్య, కంది రాములు, నాగమల్లేష్, కొమరయ్య, రాజులు వ్యవహరించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీనివాస పదవీకాలం మూడేళ్ల పాటు కొనసాగుతుంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చిగుళ్ల శ్రీను మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను అధ్యక్షునిగా ఎన్ను కున్న మల్లాపూర్ కురుమ కులస్తులకు కృతజ్ఞతలు తెలుపుతూ మల్లాపూర్లో కురు మల వైభవాన్ని పెంచుతానన్నారు. కురుమలను సామాజికంగా ఆర్థికంగా, రాజకీ యంగా అభివృద్ధిపథంలోకి తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తానని హమాలి శ్రీనివాస్ దృఢ విశ్వాసం వ్యక్తం చేశారు. అధ్యక్షునిగా ఎన్నికైన హమాలి శ్రీనివాస్, సూర్ణం రాజేష్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం ప్రతినిధులు సిహెచ్ రమేష్, వీరస్వామి, శ్రీనివాస్, జట్టా శ్రీశైలం, కంది నరసింహ, రాము, యాదగిరి, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## మద్దినాయనిపల్లిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్



**చంద్రగిరి, జనవరి 27 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం దామలచెరువు పి.హెచ్.సి పరిధిలోని మద్దినాయనిపల్లి సచివాలయం వద్ద సిమ్స్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు స్థానిక సర్పంచ్ గిరిధర్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది.పింక్ బస్సులో మహిళలు,పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో దామలచెరువు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవిరామ్,స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, సర్పంచ్ కె.గిరిధర్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళి,ఎంఎల్ హెచ్ పి జి.మీనా,ఏఎన్ఎం లావణ్య,స్థానిక వైద్య సిబ్బంది,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ఇల్లందులో అడుగడుగునా బెల్టు షాపులు

## చర్యలు చేపట్టాలంటున్న బస్తి వాసులు



**ఇల్లందు, జనవరి 27 (నిఘా న్యూస్):** పట్టణంలో బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా అడుగడుగునా పుట్టకొస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు నియంత్రించడంలో విఫలమవుతున్నారు. అంటూ బస్తివాసులు వాపోతున్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ ఆనుకొని సీతారామ పెట్రోల్ బంక్ పక్కసందులో యదేచ్ఛగా కొంతమంది దుకాణ షాపుల నిర్వాహకులు చూపులకు కిరాణాకొట్టు లోపల బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకొని అక్రమ మద్యం విక్రయిస్తూ పగలు రాత్రి తేడా లేకుండా, ఎనీ టైం ఏటీఎంలా డబ్బు కొట్టు మందు పట్టు అన్నట్లుగా రాత్రి 12 దాటిన బార్,వైన్ షాపులు బంద్ అయినా కూడా.తెల్లవారుజాము వరకు గల్లీలో మద్యం ఏరులై పారుతున్న చర్యలు చేపట్టడంలో వెనకాడుతున్న ఎక్సైజ్ శాఖ. పెట్రోలింగ్ కు వెళ్తున్న పోలీస్ సిబ్బంది కూడా చూసి చూడనట్లుగా వదిలేయడంతో మద్యం అమ్మకాలు జోరుగా కొనసాగిస్తున్నారంటూ పలువురు పేర్కొన్నారు. కొంతమంది పోకిరి వాళ్ళు అక్కడికి వెళ్లి మద్యం తీసుకొని రాత్రి వేళలో గల్లీలో రోడ్లపై సేవిస్తూ గలాటా చేస్తున్నారని అన్నారు. పట్టణానికి నడిబొడ్డున ఉన్న సీతారామ పెట్రోల్ బంక్ సందు మద్యం విక్రయాలకు అడ్డగా మారడంతో ఇతర ప్రాంతాల నుండి వచ్చిన యువత మద్యం సేవిస్తూ స్థానిక బస్తీ వాసులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిపారు. ఎవరైనా ఏదైనా అంటే దాడులకు సైతం వెనకాడడం లేదని మద్యం మత్తులో ఏం చేస్తున్నారో వారికి అర్థం కాకపోవడంతో బస్తి వాసులు భయాందోళనకు గురవుతున్నామన్నారు. ఇదే కాక బెల్టు షాపులకు ఎదురుగా గర్భిణీ ఆసుపత్రి, జనరల్ ఆసుపత్రిలు, ఉండటంతో మహిళల రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తపరిచారు. కొందరు రోడ్లపై ఉన్న జరగట్లేదంటూ మహిళలు వాపోయారు, కిరాణా షాపులు. బంగారం షాపులు ఉండడంతో అక్కడ కు వచ్చే కస్టమర్స్ కూడా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అనుమతులు లేని బెల్ట్ షాపుల నిర్వాహకుల స్వలాభం కోసం అనేకులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని. బెల్టు షాపులు కారణంగా పట్టణవాసులు, పరిసర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు ఇబ్బంది పడటం సరికాదని బస్తివాసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ, పోలీస్ అధికారులు తనిఖీలు నిర్వహించి బెల్టు షాపులు ఎత్తివేసేలా చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.

# పీర్జాదిగూడలో ఐదేండ్ల ఆదర్శ పాలన

- సభ్యులందరి సహకారంతో సమగ్రాభివృద్ధి
- మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి
- బిఆర్ఎస్ కార్పొరేటర్లను సన్మానించిన కమీషనర్ త్రిలేశ్వర్ రావు



**పీర్జాదిగూడ, జనవరి 27 (నిఘా న్యూస్):** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్ గా భవిష్యత్ తరాలకు ఆదర్శ పాలన అందించామని జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో తొలి మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి,మధుసూదన్ రెడ్డి,దొంతిరి హరిశంకర్ రెడ్డి,కొ ఆప్షన్ సభ్యులు నాజియా జావీద్ ఖాన్ లను కమీషనర్ త్రిలేశ్వర్ రావు ఘనంగా షాలువాతో సన్మానించి జ్ఞాపికలను బహుకరించారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలో పీర్జాదిగూడ నగర పాలక సంస్థకు ప్రత్యేక స్థానం ఉండేలా బాధ్యతలు స్వీకరించిన నాడు రాజ్యాంగంపై చేసిన ప్రమాణం మేరకు నిజాయతీగా.. అవినీతికి ఆస్కారం లేకుండా సభ్యులందరి సహకారంతో పాలన చేశామన్నారు.పదవి చేపట్టిన మొదటి సంవత్సరంలో కోవిడ్ మహమ్మారి వ్యాపించడంతో నగర ప్రజలకు అండగా నిలిచి రెండు పర్యాయాలు కోవిడ్ ఐసోలేషన్ సెంటర్ ఏర్పాటు చేసి భరోసా కల్పించామన్నారు. నగరంలో ఎన్నడూ లేనివిధంగా వరదలు ముంచెత్తడంతో అనేక కాలనీలు నీట మునిగిన సందర్భంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పీర్జాదిగూడ,బోడుప్పల్ కార్పొరేషన్లకు ఎస్ఎన్డిపి ద్వారా రూ.110 కోట్లను మంజూరు చేసుకోవడం జరిగిందన్నారు. పీర్జాదిగూడ కమాన్ నుండి పర్వాతాపూర్ వరకు 4లైన్ల రోడ్డు విస్తరణ కోసం హెచ్ఎండిఏ ద్వారా సుమారు రూ.26 కోట్ల నిధులను సమకూర్చుకొని నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. సుమారు రూ13.5కోట్లతో పీర్జాదిగూడ చెరువును మినీ ట్యాంక్ బండ్ మాదిరి అభివృద్ధి చేయడం ద్వారా నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడం సంతోషాన్ని కలిగించిందన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్,చామకూర మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# పాకాలలో జాతీయ ఎలక్ట్రీషియన్ డే




**చంద్రగిరి, జనవరి 27 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలంలో జాతీయ ఎలక్ట్రిషన్ డే వేడుకను మండల ప్రైవేట్ ఎలక్ట్రిషన్ అధ్యక్షుడు సభాస్టిన్,ఉపాధ్యక్షుడు ముని కృష్ణారెడ్డి,కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఎలక్ట్రిషన్ బల్బును కనుగొన్న థామస్ అల్వా ఎడిషన్,విద్యుత్ ను కనుగొన్న మైఖేల్ ఫారడే అని వివరించారు.ఈసందర్భంగాసోమవారంజాతీయఎలక్ట్రిషన్డే జరుపుకుంటారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు సీనియర్ ఎలక్ట్రీషన్లు మాట్లాడుతూ జాతీయ ఎలక్ట్రిషన్ డే సందర్భంగా పాకాల ఆర్టీసీ బస్టాండ్ నుండి చిత్తూరు రోడ్డు కూడలి వరకు ర్యాలీ నిర్వహించామని పేర్కొన్నారు.విద్యుత్తు మన జీవితాలలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఇది మన ఇళ్లను వెలుగులో ఉంచడానికి, ఎలక్ట్రానిక్ పరికరాలను నడపడానికి,అనేక ఇతర పనులకు ఉపయోగపడుతుందని అన్నారు.విద్యుత్ వినియోగంలో ఏమైనా అంతరాయం కలిగినా, విద్యుత్ ఉపకరణాలు రిపేర్ కు వచ్చిన వాటిని రిపేర్ చేస్తుంటామని అన్నారు. నేటి ఈ సమాజంలో ఎలక్ట్రిషన్ ఎంతో అవసరం అని తెలిపారు. ఎలక్ట్రిషన్, విద్యుత్ సిబ్బందికి పనిముట్లు ఇచ్చి, ప్రభుత్వం ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గంగాధరం, బాలాజీ, భాస్కర్, లోకనాథసింగ్, సబీర్, సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్ ఓ సి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే పట్లోళ్ల



**నిజాంపేట్, జనవరి 27 (నిఘా న్యూస్):** సంగారెడ్డి జిల్లా రాంరెడ్డి పేట్ సోమవారం మాజీ సర్పంచ్ భూమేష్ ఆరోగ్య చికిత్స కోసం రెండు లక్షల రూపాయలు ఎల్ ఓ సి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సోదరుడు భూమేష్ పేదప్రజల కోసం ప్రజాసేవ చేసే యువ నాయకుడు ఆరోగ్యం బాలేదు అని తెలిసిన వెంటనే చాలా బాధపడ్డాను అధైర్య పడొద్దు నేను ఉన్నాను అవసరమైతే చికిత్స కోసం ఎల్ ఓ సి అందజేస్తానని పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అలాగే ఎవరైనా ఆరోగ్యం బాలేక హాస్పిటల్ వెళ్తే సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్నటువంటి సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ భూమేష్, శ్రీకాంత్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## కుంభమేళాలో మాజీ ఎంపీటీసీ బృందం పవిత్ర స్నానాలు



**నిజాంపేట్, జనవరి 27 (నిఘా న్యూస్):** సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి లింగారెడ్డి బృందం ఉత్తరప్రదేశ్ ప్రయాగ్ రాజ్లో జరుగుతున్నటువంటి మహా కుంభమేళ త్రివేణి సంగమం ఘాట్ వద్ద పుణ్యస్నానాలు ఆచరించడం జరిగింది. అనంతరం పడవలో నదిలో తిరగడం జరిగింది.ఈ పవిత్రమైన మహా కుంభమేళాలో వివిధ దేశాల నుంచి సాధువులు పారిశ్రామికవేత్తలు పుణ్య స్నానాలు చేశారు. యూపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ త్రివేణి సంగమం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం చాలా సంతోషకరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాల శంకర్ నారాయణరెడ్డి కురుమ దేవయ్య నీలి శేఖర్, ఒగ్గు లచ్చయ్య చాకలి బేతయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచిన లోకేష్ యువగళం పాదయాత్రకు రెండేళ్లు పూర్తి

### నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**నంద్యాల, జనవరి 27 (నిఘా న్యూస్):** ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనపై సమరశంఖం పూరించి, రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన చారిత్రాత్మక యువగళం పాదయాత్ర ప్రారంభమై రెండేళు పూర్తయిందని ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐదు కోట్లమంది ఆశలు, ఆశయాలను ప్రతిబింబిస్తూ పాదయాత్రగా ప్రజల్లోకి వెళ్లిన యువనేత నారా లోకేష్ యువగళంతో రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్నే మార్చేశారని ప్రకటించారు. ఉద్యోగాల్లేక నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న యువత ఒకవైపు, ఇంటినుంచి బయటకు వెళ్తే తిరిగి క్షేమంగా తిరిగి వస్తామనే గ్యారంటీలేక భయాందోళనలతో మహిళలు మరోవైపు, అడ్డగోలు బాదుడుతో బతుకుభారంగా మారిన సామాన్య జనం, ఇంకోవైపు. ఇలా అడుగడుగునా అభద్రతాభావం, నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు నేనున్నానంటూ యువనేత నారా లోకేష్ ఆనాడు జనంలోకి వెళ్లారని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు.

## రమణయ్యగారి పల్లెలోఉచిత పశువైద్య శిబిరం



**చంద్రగిరి, జనవరి 27 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం రమణయ్యగారిపల్లి పంచాయతీ రవణఖ్ నగర్ లో పశు సంవర్ధక శాఖ ప్రభుత్వం ఉచిత పశు ఆరోగ్య శిబిరంసోమవారంనిర్వహించారు. గ్రామంలో ఉన్నటువంటి పశువులకు పిడుదుల మందు పిచికారి చేసి, మేకలకు, దూడలకు, పశువులకు నట్టల నివారణ మందు తాగించడం జరిగింది. గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు.టిడిపి నేత షాజహాన్ భాష, స్థానిక నాయకుల సమక్షంలో పశువులకు సంబంధించిన ప్రభుత్వం తరపున ఉచిత మందులు పంపిణీ చేశారు. ఉచిత పశు వైద్య శిబిరాల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వై.బి పవన్ కుమార్,వి.ఎ.ఎస్ హేమంత్ కుమార్ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.



## ఒకే వాహనానికి మూడు నెంబర్ ప్లేట్లు

**సీజ్ చేసిన ఉప్పల్ ఆర్టీఏ అధికారులు**

**ఉప్పల్, జనవరి 27(నిఘా న్యూస్):** ఉప్పల్ ప్రాంతీయ రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వాహనానికి ఏకంగా 3 నెంబర్ ప్లేట్లు (యూపీ 64 టి 9495, ఏపీ 39 యుడి 7611,తో పాటు తెలంగాణలో) ఉన్నట్లు గుర్తించారు. ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పేరిట నెంబర్ ప్లేట్లు ఒకదానిపై ఒకటి ఉన్నాయి. ఉత్తర ప్రదేశ్ నుంచి తెలంగాణకు వస్తుండగా నాగోల్ వద్ద పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి నాగోల్ డ్రైవింగ్ ట్రాక్ ప్రాంతానికి తరలించినట్లు వెహికల్ ఇన్ స్పెక్టర్ రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ నంబర్ ప్లేట్ మార్చిన తప్పు నంబర్ ప్లేట్లు వినియోగించిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవిఐ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## రంగాపురం కృష్ణానది నుంచి... అక్రమ ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లపై కేసు




**పెబ్బేరు, జనవరి 27 (నిఘా న్యూస్):** అనుమతులు తేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. పెబ్బేరు మండలం రంగాపురం కృష్ణానది నుంచి అక్రమంగా ఇసుక అక్రమ రవాణా కొద్దీ రోజుల నుంచి చేస్తున్నట్లుగా సమాచారం మేరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కృష్ణానది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఏడు ఇసుక ట్రాక్టర్లను సోమవారం పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. పెబ్బేరు మండలం రంగాపురం గ్రామ శివారులోని కృష్ణానది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉచిత ఇసుక అనేది నిర్దేశించిన ప్రాంతంలోనే తీసుకెళ్లాలని ఎక్కడ పడితే అక్కడ నుంచి ఇసుక తరలించ రాదని హెచ్చరించారు.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ విద్యుత్ ఏఈ కృష్ణ



**మనోహరాబాద్, జనవరి 27 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్ళకల్ విద్యుత్ శాఖ అధికారి కృష్ణ అదే గ్రామంలో లక్ష్మి ఇండస్ట్రీస్ వారు ట్రాన్స్ఫారం కనెక్షన్ కోసం విద్యుత్ శాఖకు దరఖాస్తు చేసుకోగా పలుమార్లు ఇండస్ట్రీ యజమాని నుండి 50 వేల రూపాయలు విద్యుత్ ఏఈ కృష్ణ కోరగా అతను 30 వేలకు ఒప్పందం కుదిరింది. ఇందుకుగాను 10 వేలను ముందుగా ఈనెల 18న యజమాని అధికారి కృష్ణకు అందించారు. మిగతా ఇరవై వేల రూపాయలు సోమవారం రోజున ఇస్తానని ఒప్పుకున్నాడు. ఇదే కోణంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ అధికారి సుదర్శన్ వీరితోపాటు రేంజ్ ఇన్స్పెక్టర్ లు వెంకటేష్, రమేష్ తో కలిసి సదరు అధికారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని అదుపులోకి తీసుకోవడం జరిగింది. లక్ష్మీ ఇండస్ట్రీస్ బాధితుడు మీడియాతో మాట్లాడుతూ ప్రతి విషయంలో అధికారులు లంచానికి ఎగబడుతున్నారని ఒక్క విద్యుత్తు శాఖలోనే కాక ఇతర ఇతర శాఖలలో ప్రభుత్వాధికారులు ఏ అవసరమున్న ముందుగా లంచం ఇవ్వనిది పనిచేయడం లేదని బాధితుడు మీడియాకు తెలిపారు.

## దీర్ఘకాలిక ప్రణాళికతో విద్యార్థుల అభివృద్ధి



**గోకవరం, జనవరి 27 (నిఘా న్యూస్):** ఆట,పాటలతో విద్యార్థులపై ఒత్తిడి లేకుండా కనీసం సంవత్సరానికి ఒక గ్రేడ్ అయినా పెరిగే విధంగా పిల్లలను ప్రోత్సహిస్తూ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం,హాజరు శాతం పెరిగే విధంగా కృషి చేయాలని పాఠం శెట్టి పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు మన బాధ్యతగా భావించి విద్యార్థులను మంచి పౌరులుగా తయారు చేయాల్సిన అవసరం అందరి మీద ఉందని కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో హైస్కూల్ వేదికగా ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి తరగతిలోనూ క్లాస్ ఫస్ట్ సెకండ్ థర్డ్ ప్రైజ్ లతో పాటు డీ గ్రేడ్ నుండి సీ గ్రేడ్ కి, సీ గ్రేడ్ నుండి బి గ్రేడ్ కి,బి గ్రేడ్ నుండి ఏ గ్రేడ్ కి, ఏ గ్రేడ్ నుండి ఏ ప్లస్ కి వచ్చిన ప్రతి విద్యార్థికి కూడా ప్రోత్సాహక బహుమతి ఇవ్వడం జరుగుతుందని వీటితో పాటు ఒక రోజు కూడా బడి మానకుండా నూరు శాతం హాజరు సాధించిన విద్యార్థులందరికీ బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు.

## మద్యం మత్తులోనే...

# ట్యాంకు బండ్‌లో బోట్ల దహనం

- అనుమతి లేకుండా బాణసంచా పేల్చినట్లు ఆరోపణలు
- ఘటనలో యువకుడి గల్లంతు ఇద్దరికీ తీవ్ర గాయాలు
- పడవల్లో మద్యం సీసాలు
- మద్యం మత్తే ప్రమాదానికి కారణమా..?



**హైదరాబాద్, జనవరి 27(నిఘా న్యూస్):** ట్యాంక్ బండ్ అగ్ని ప్రమాదం, బోట్ల దగ్ధం కేసులో హైదరాబాద్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం భారత్ మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీపుల్ ప్లాజా వద్ద భారత్ మాత మహా హారతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహా హారతి అనంతరం 8.30గంటల ప్రాంతంలో ట్యాంక్ బండ్‌లో ఏర్పాటు చేసిన ఓ బోట్ లా ద్వారా పెద్ద ఎత్తున బాణసంచాను కాల్చారు. ఆర్గనైజర్‌లు సుకుమార్ రెడ్డి రంగంపల్లి రాజు ఆధ్వర్యంలో తారాజువ్వలను కాల్చుతుండగా ప్రమాదవశాత్తు ఓ తారాజువ్వ రివర్స్ డైరెక్షన్ వచ్చి పడవలో ఉన్న బాణాసంచా పై పడి పేలిపోయింది. దీంతో బాణసంచా పేలిపోయి బోటు పూర్తిగా కాలిపోయి పక్కనే ఉన్న జెట్టికి కూడా మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఫైర్ క్రాకర్స్ ఆపరేటర్ గణపతి, బోట్ డ్రైవర్స్ పల్లె ప్రణీత్, దుబాసి సునిత్ లకు తీవ్ర గాయాలు అయ్యాయి. అదేవిధంగా జెట్టిలో ఉన్న వారిలో కొందరికి గాయాలు కాగా వారు ప్రమాదాన్ని పసిగట్టి నీళ్లలోకి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ విషయమై లుంబిని పార్క్ మేనేజర్ ప్రభుదాస్ సెక్రటేరియట్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ట్యాంక్ బండ్ లో అగ్ని ప్రమాదం రెండు బోట్లు దగ్ధంలో కేసులో అజయ్ అనే యువకుడు మిస్సింగ్ అయినట్లు తల్లిదండ్రులు పోలీసుల ఫిర్యాదు చేశారు. ఒక్క బోటులో ఫ్రెండ్స్‌తో కలిసి ఉన్న అజయ్ (21) జాడ తెలియలేదు. ఈ మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. అనుమతి లేకుండా బాణసంచా పేల్చినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. అంబర్ పేట కు చెందిన బిజెపి నేత రంగంపల్లి రాజు ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా భారత్ మాత హారతి సందర్భంగా రాజమండ్రి నుండి బాణసంచా తయారు చేసే వారిని ఇక్కడికి తీసుకొచ్చినట్లు తెలిసింది. దీనికి గాను ఆర్గనైజర్ల వద్ద ఆయన పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. అదేవిధంగా ప్రమాదం జరిగిన సమయంలో రంగంపల్లి రాజు ఆధ్వర్యంలో పడవల్లో మందు పార్టీ జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. తన స్నేహితులతో కలిసి ఆయన జెట్టిలో కూర్చుని మద్యం సేవించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా బాణసంచా కాల్చే వారికి కూడా మద్యాన్ని తాగించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ప్రమాదానికి మద్యం మత్తే కారణమనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

## గీత కార్మికులకు కాటమయ్య రక్ష కవచ్ కిట్ల శిక్షణ



**అశ్వారావుపేట, జనవరి 27 (నిఘా న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, అచ్యుతాపురం గ్రామంలో దమ్మపేట కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ బిసి వెల్ఫేర్ డిపార్ట్మెంట్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్లుగీత వృత్తి దారులకు కాటమయ్య రక్ష కవచ్ కిట్ల ట్రైనింగ్ ని నల్గొండ జిల్లా నుంచి వచ్చిన శిక్షణ నిర్వాహకులు సమక్షంలో సోమవారం అచ్యుతాపురం గ్రామంలో రామాలయం ఎదురుగా ఉన్నటువంటి తాటి చెట్ల వద్ద నిర్వహించారు. ట్రైనింగ్ అనంతరం సభ్యులకు బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారిణి విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ అట్టం లక్ష్మణరావు, దుర్గమ్మ, ప్రొఫెషనల్ ఎక్సైజ్ శాఖ డిపార్ట్మెంట్ పి. భరత్ ఆధ్వర్యంలో కాటమయ్య రక్ష కవచ్ కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం గ్రామ ప్రజలు కొనకళ్ళ కృష్ణ, బైగాని కృష్ణ, కొనకళ్ళ లక్ష్మీనర్సు, పానుగంటి చెన్నారావు, గొల్లపల్లి సత్యనారాయణ, దమ్మపేట కల్లుగీత సొసైటీ ఇంచార్జ్ పానుగంటి లక్ష్మణ్ గౌడ్, సభ్యులు పానుగంటి రామారావు, కొనకళ్ళ వెంకట్రావు, కాసగాని సూరిబాబు, పానుగంటి వెంకటేశ్వరరావు, కొప్పుల రాంబాబు, బొమ్మగాని చిన్న లక్ష్మీనారాయణ, పానుగంటి దుర్గారావు, బైగాని రాంబాబు, గొల్లపల్లి ప్రసాద్, కొనకళ్ళ గంగాధరరావు, గొల్లపల్లి ఆదినారాయణ, కొనకళ్ళ చెన్నారావు, పర్సా చెన్నారావు, కొనకళ్ళ మహేష్, బైగాని సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరులో శ్రీ రుద్ర సహిత శత చండీ యాగం

**చండీ యాగంలో పాల్గొన్న మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు**





**మహేశ్వరం, జనవరి 27(నిఘా న్యూస్):** మహేశ్వరం నియోజక వర్గంలోని కందుకూరు మండలం రేవల్లి జనార్ధన్ శర్మ వ్యవసాయ క్షేత్రం దాసర్లపల్లి ముచ్చర్ల క్రాస్ రోడ్‌లో శ్రీ రుద్ర సహిత శత చండీ యాగం 108 గుండాలలో నిర్వహించారు. గణపతి పూజ, గురు, దేవత ప్రార్థన, మహాసంకల్పం స్వస్తి పుణ్య హవాచకం, సహస్ర గణపతి హోమం వేద పారాయణం హోమం తో పాటు ఇతర క్రతువులు పీఠాధిపతులు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య చండీయాగం ఘనంగా నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని పాడిపంట పిల్లాపాపలతో చల్లగా చూడాలని ఆ చండీశ్వరి దేవిని కోరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి , మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు , ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ , మండల బీఆర్ఎస్ నాయకుడు మన్నె జయేంద్ర ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సెట్ బ్యాక్ లేకుండా... రహదారిపైనే

# బహుళ అంతస్తుల భవన నిర్మాణం

- అనుమతులు లేని బోరు, రోడ్డుపైనే మెట్లు
- గోల్నాక శాంతి నగర్ లో ఆక్రమ నిర్మాణం
- చర్యలకు వెనుకాడుతున్న జిహెచ్ఎంసి అంబర్ పేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికార యంత్రాంగం



**అంబర్‌పేట, జనవరి 27 (నిఘా న్యూస్):** గోల్నాక శాంతి నగర్‌లో జిహెచ్ఎంసి నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమంగా భవన నిర్మాణ పనులు జరుగుతున్న జిహెచ్ఎంసి అంబర్ పేట సర్కిల్ -16 టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలకు వెనుకాడు తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శాంతినగర్ ప్రధాన రహదారి పక్కన జనవాసాలను ఆనుకుని ఈ బహుళ అంతస్తుల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సదరు ఇంటి యజమాని జిహెచ్ఎంసి నుండి జి ప్లస్ టూ అనుమతి పొంది నిబంధనలకు విరుద్ధంగా నాలుగు అంతస్తుల భవనాన్ని, పైన పెంట్ హౌస్‌ని నిర్మిస్తున్నారు. ఫుట్ పాత్ పైనే బోరింగ్ వేసిన సదరు ఇంటి యజమాని రోడ్డుపైకి జరిగే మెట్లు నిర్మించి ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా కమర్షియల్ భవనాన్ని నిర్మిస్తున్నాడు. భవిష్యత్తులో ఇక్కడ రోడ్డు వైడనింగ్ పనులు జరిగే అవకాశం ఉన్నప్పటికీ సదరు ఇంటి యజమాని నిబంధనలను ఖాతరు చేయకుండా ముందుకు జరిగి భవనాన్ని నిర్మిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఈ రహదారి పైన భారీగా ఇసుక,ఇటికలు, కంకర డంప్ చేస్తూ ఉండడంతో రాకపోకలకు సైతం ఇబ్బందిగా మారింది. ఈ ఆక్రమ నిర్మాణంపై స్థానిక పౌరులు జిహెచ్ఎంసి అంబర్ పేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు వరుసగా ఫిర్యాదులు చేస్తున్న పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. సామాన్య మధ్యతరగతి ప్రజలు గల్లీలో చిన్న ఇంటిని నిర్మించుకుంటే వెంటనే అక్కడికి చేరుకొని చర్యలు తీసుకునే టౌన్ ప్లానింగ్ అధికారులు ఇక్కడ నిబంధన విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్న చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తుందని స్థానిక ప్రజలు ఆరోపించారు.



సదాశివపేటలోని బీసీ హాస్టల్‌లో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ సోమవారం రాత్రి నిద్ర చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో కిచెన్ తీరు పారిశుద్ధ్యం తదితర సమస్యలపై విద్యార్థులతో ఆరా తీశారు.
- సదాశివపేట, జనవరి 27 (నిఘా న్యూస్):

## కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**మార్కెట్ ఫెడ్ విభాగపు అధికారి వెంకన్న**



**తాండూరు, జనవరి 27 (నిఘా న్యూస్):** తాండూరు పట్టణ కేంద్రంలోని డి.సి.ఎం.ఎస్ కార్యాలయం ఆవరణలో మార్కెట్ ఫెడ్ విభాగం ఆధ్వర్యంలో గత వారం రోజుల క్రితం ప్రభుత్వ మద్దతు ధరతో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మార్కెట్ ఫెడ్ విభాగపు అధికారి వెంకన్న వెల్లడించారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మార్కెట్ ఫెడ్ విభాగపు అధికారి వెంకన్న, డీసీఎంఎస్ అధికారి మాజీత్ తాండూరు పట్టణ కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయానికి పర్యటించి, మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఎం. శ్రీనివాస్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రంలో రైతులు కందులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం కందులు క్వింటాలకు ప్రభుత్వ మద్దతు ధర 7550 రూపాయలతో కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. తాండూరు నియోజకవర్గం లోని రైతులు దళారుల వద్దకు వెళ్లి మోసపోవద్దు అని సూచించారు.

## పిస్తా హౌస్‌కు షోకాజ్ నోటీసులు




**ఉప్పల్, జనవరి 27 (నిఘా న్యూస్):** ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న ఫిస్తా హౌజ్‌లో ఆదివారం మధ్యాహ్నం సమయంలో అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. వంట గది చిమ్నీలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి భారీగా పొగలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అర్పినారు. ఉప్పల్ పోలీసులు ఆదివారం పిస్తా హౌస్ పై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సోమవారం పిస్తా హౌస్ యజమాని, మేనేజర్ లకు షోకేజ్ నోటీసులు జారీ చేశారు. ఫైర్ అధికారులను,జిహెచ్ఎంసి అధికారులను నివేదికలు అందజేయాలని లేఖలు జారీ చేశారు. ఆయా శాఖల నివేదికలు అందగానే కేసు దర్యాప్తు కొనసాగిస్తామని ఉప్పల్ పోలీసులు చెప్పారు.

## రాష్ట్ర పర్యాటక రంగానికి పెట్టుబడుల వెల్లువ

**విశాఖపట్నం, జనవరి 27 (నిఘా న్యూస్):** విశాఖపట్నంలో జరిగిన రీజనల్ ఇన్వెస్టర్స్ టూరిజం సమ్మిట్ వేదికగా రూ1, 217కోట్ల విలువైన 8పర్యాటక ప్రాజెక్టుల ఎంవోయూలపై రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సంతకాలు చేశారు. సోమవారం విశాఖపట్నం బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హొటల్ లో జరిగిన రీజనల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు 150మందికి పైగా ఇన్వెస్టర్లు హాజరయ్యారు.



Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com